Follow: @ANNTELUGU

29-07-2025

ANN తెలుగు

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 235 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఆపరేషన్ సిందూర్ ఇంకా ఉంది

### కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్

గట్టిగా తిప్పికొట్టాం- జై శంకర్

లోక్ సభలో చర్చ

**ఢిల్లీ, మహా:** పహల్గాం దాడిలో ప్రియమైన వారిని కోల్పోయిన బాధిత కుటుంబాలకు న్యాయం చేసేందుకే ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించినట్లు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. పాక్ కాళ్లబేరానికి వచ్చేట్లు చేశామని లోక్‌సభలో జరిగిన చర్చలో తేల్చిచెప్పారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా రాజకీయ, సైనిక లక్ష్యాలు నెరవేరాయని వివరించారు. మిగతా 2లో

టాప్ న్యూస్



### దేశంలో పనికిమాలిన వాళ్లు ఎక్కువైపోయారు

- రకుల్ ప్రీత్ సింగ్ ఫైర్
- సోషల్ మీడియాలో నెగెటివ్ కామెంట్లపై భగ్గు
- పనీపాట లేక సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని ఆగ్రహం

02

### 12 వేల మందిపై టీసీఎస్ వేటు

- హెచ్ఆర్ విధానంలో ముఖ్యమైన మార్పులు
- వర్క్‌ఫోర్స్ మోడల్ పునర్వ్యవస్థీకరణ వంటి వ్యూహాత్మక చర్యలు

07



### చెస్ క్వీన్‌గా దివ్య దేశ్ ముఖ్..


- ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా చరిత్ర
- తెలుగు తేజం కోనేరు హంపి ఓటమి
- మాస్టర్ హోదాను దక్కించుకున్న దివ్య

02

SRI GOLD
TRUSTED GOLD BUYERS

బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 99,930 |
| 22 క్యారెట్ | 91,600 |
| సిల్వర్ (కేజీ) | 1,16,000 |



# తగ్గేదెలే...

## బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీలోనే తాడోపేడో

రాష్ట్రపతిని, ప్రధానిని కలవాలని కేబినెట్ నిర్ణయం

అవసరమైతే ఢిల్లీలో ధర్నాకు సై అన్న సీఎం రేవంత్

రిజర్వేషన్లు సాధించాకే.. ఎన్నికలకు వెళ్ళాలని నిర్ణయం

బీసీ రిజర్వేషన్లపై తగ్గేదెలే అని తెలంగాణ కేబినెట్ తేల్చిచెప్పింది. కేంద్రంపై నలువైపులా ఒత్తిడితెచ్చయినా బీసీ రిజర్వేషన్లు సాధించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. రిజర్వేషన్ల సాధనకు తీవ్ర ఒత్తిడి తీసుకురావాలని, రాష్ట్రపతి ద్రౌపది ముర్మును, ప్రధాని మోదీని కలిసి 9వ షెడ్యూల్ లో చేర్చి తెలంగాణలో 50శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వాలని కోరాలని కేబినెట్ తీర్మానించింది. కేబినెట్ సమావేశంలో బీసీ కోటా ఎలా సాధించాలన్న అంశంపై సీరియస్ చర్చ జరిగింది. బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్రం వైఖరిని నిరసిస్తూ ఢిల్లీలో భారీ ధర్నా చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆగష్టు 5వ తేదీన మంత్రులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ, కేంద్రమంత్రులను కలవనున్నారు. అంతేగాకుండా.. బీసీ రిజర్వేషన్ల విషయంలో ఇండియా కూటమి మద్దతు కూడా కోరనున్నారు. రిజర్వేషన్ల అంశం కొలిక్కి వచ్చిన తర్వాతనే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపిన బీసీ బిల్లు ప్రస్తుతం కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నది. మరోవైపు రిజర్వేషన్ల ఖరారుపై హైకోర్టు ఇచ్చిన గడువు పూర్తయింది. వీటన్నింటి నేపథ్యంలో కేంద్రంపై పోరాడడమే మార్గమని కేబినెట్ అభిప్రాయపడ్డట్లు తెలిసింది. - మహా, హైదరాబాద్



### టెస్లాకి పోటీగా భారత్‌లోకి విన్‌ఫాస్ట్

- ఆసక్తికరంగా కార్ రేస్
- రూ.50 నుండి 65లక్షల మధ్య ధర
- ఈ ఏడాదే హైదరాబాద్ షోరూం ప్రారంభం
- దేశవ్యాప్తంగా 32షోరూంల ప్రారంభానికి డీల్

వివరాలు 2లో

స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ | 80,891.02 |
| నిఫ్టీ | 24,680.90 |

ఈరోజు చికెన్ ధరలు

1 కేజీ రిటైల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 180 | 220 | 230 |

హోల్ సేల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |



## రాజకీయాలు పక్కనపెట్టి అందరూ కలిసి రండి

- మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు
- కేబినెట్‌లో ఐదుగంటల చర్చ దీనిపైనే
- రిజర్వేషన్ల సాధనకు చిత్తశుద్ధితో ఉన్నాం

**హైదరాబాద్, మహా :** స్థానిక సంస్థలు అలాగే, విద్య, ఉద్యోగాల కల్పనలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన రెండు బిల్లులకు వెంటనే చట్టబద్ధత కల్పించాలని రాష్ట్ర మంత్రిమండలి గౌరవ రాష్ట్రపతికి విజ్ఞప్తి చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో పాటు బీసీ సంఘాల ప్రతినిధులు ఆగస్టు 5, 6, 7 తేదీల్లో ఢిల్లీ వెళ్లాలని నిర్ణయించారన్నారు. మిగతా 2లో

బీసీ రిజర్వేషన్లపై కేసీఆర్ మౌనం 02

## మీనాక్షి ప్లాన్ అదుర్స్!

### ఈ నెల 31 నుంచి పాదయాత్ర

- 7 రోజులు 6 నియోజకవర్గాల్లో పర్యటన
- ఉమ్మడి జిల్లాలోని ఒక సెగ్మెంట్‌లో శ్రమదానం, బస
- పంచాయతీ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి మైలేజ్
- తన మార్క్‌తో దూసుకెళ్తున్న కాంగ్రెస్ ఇంఛార్జ్ నటరాజన్

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేయాలని నిర్ణయించుకున్నారు. అందుకు ముహూర్తం సైతం ఖరారు చేశారు. ఈనెల 31 నుంచి పాదయాత్ర చేయాలని నిర్ణయించుకున్నారు. వారం రోజుల పాటు నియోజకవర్గాల్లో మిగతా 2లో



ఈరోజు గుడ్డు ధరలు

ఎన్ఈసీసీ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 4.25 | 127.5 |

హోల్ సేల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 4.8 | 127.5 |

రిటైల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 4.51 | 135.15 |

## లోకల్‌బాడీ ఎన్నికల్లో బీసీలకు పెద్ద పీట


- 42 శాతం సీట్లు పక్కాగా వారికే కేటాయిస్తాం
- కొన్ని మండలాల్లో కులగణన అసలు జరగనే లేదు
- వచ్చే నెల 2న బీసీ రిజర్వేషన్లపై మహాధర్నా నిర్వహిస్తాం
- బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్ రావు హాట్ కామెంట్స్




02

## సూసైడ్ స్టార్.. సొల్లు ఆపు

### పాడిపై ఎంపీ చామల ధ్వజం



**ఢిల్లీ, మహా:** మీ దొర దగ్గర మార్కులు కొట్టేయడానికి, పాపులారిటీ కోసం దరిద్రపు డ్రామాలు ఆపు అంటూ సోమవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తన ఎక్స్ ఖాతా వేదికగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై ధ్వజమెత్తారు. సూసైడ్ స్టార్ కౌశిక్ రెడ్డి నీ సొల్లు మాటలాపు అని ట్వీట్ చేశారు. నాకు ఓట్లు వేయకపోతే పాడె మీద పడుకుంటానని ప్రజలను బ్లాక్ మెయిల్ చేశాడని, ఆయన్ను సూసైడ్ స్టార్ అంటారని విమర్శలు గుప్పించారు. 16 మంది హీరోయిన్ల ఫోన్లు ట్యాప్ అయ్యాయని అబద్ధాలు ప్రచారం అని పేర్కొన్నారు. ఇదా మీ రాజకీయం? సూసైడ్ స్టార్ అంటూ పాడి కౌశిక్ రెడ్డికి ట్యాగ్ చేశారు. మీ దొర దగ్గర మార్కులు కొట్టేయడానికి, పాపులారిటీ కోసం చేసే ఈ దరిద్రపు డ్రామాలు ఇకనైనా ఆపు అని హితవు పలికారు. మొన్నటిదాకా కాంగ్రెస్ పార్టీలో ఉండి ఇప్పుడు మా నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత నీకు లేదు.. అని ట్వీట్‌లో పేర్కొన్నారు.



# దేశంలో పనికిమాలిన వాళ్లు ఎక్కువైపోయారు: రకుల్ ప్రీత్ సింగ్ ఫైర్

### సోషల్ మీడియాలో నెగెటివ్ కామెంట్లపై భగ్గు

### పనీపాట లేక సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని ఆగ్రహం



**మహా:** సోషల్ మీడియాలో నెగెటివ్ కామెంట్లు చేసే వారిపై నటి రకుల్ ప్రీత్ సింగ్ తీవ్రంగా మండిపడ్డారు. దేశంలో పనికిమాలిన వాళ్లు ఎక్కువైపోయారని, ఇతరులను బాధపెట్టడం తప్ప వారికి పనేమీ లేదని విమర్శించారు. 'పనీపాట లేకపోవడం, ఫ్రీ డేటా కారణంగా కొంతమంది సోషల్ మీడియాలో నెగెటివిటీని వ్యాపింపజేస్తున్నారు. ఇతరులపై కామెంట్లు పెడుతూ సంతోషిస్తున్నారు. సెలెబ్రెటీల వ్యక్తిగత జీవితాలపై దుష్ప్రచారం చేయడం, వారిని వ్యక్తిగతంగా బాధపెట్టడమే కొందరు పనిగా పెట్టుకున్నారు. వారికి ఇంతకంటే వేరే పనేమీ లేకుండా పోయింది. మన దేశంలో పనికిమాలిన వాళ్ళు ఎక్కువయ్యారు' అంటూ రకుల్ ప్రీత్ సింగ్ తాజాగా పోస్ట్ పెట్టారు.

ప్రస్తుతం ఈ కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్ గా మారగా నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. కొంతమంది రకుల్ కు మద్దతుగా కామెంట్లు పెడుతుండగా మరికొందరు మాత్రం విమర్శిస్తున్నారు. పెళ్లి తర్వాత సినిమాలు తగ్గించింది. ఇటీవల రకుల్ నటించిన 'మేరే హస్బెండ్ కి బివి' చిత్రం విడుదలైంది. ఈ సందర్భంగా రకుల్ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ పలు అంశాలపై తన అభిప్రాయాలను పంచుకుంటోంది. తనను ట్రోల్ చేస్తున్న వారికి కౌంటర్లు ఇస్తూ బిజీబిజీగా గడుపుతున్నారు.

# టెస్లాకి పోటీగా భారత్‌లోకి విన్‌ఫాస్ట్

### ఆసక్తికరంగా కార్ రేస్

- **రూ.50 నుండి 65లక్షల మధ్య ధర**
- **ఈ ఏడాదే హైదరాబాద్ షోరూం ప్రారంభం**
- **దేశవ్యాప్తంగా 32షోరూంల ప్రారంభానికి డీల్**



**మహా, బిజినెస్ డెస్క్:** భారత్ లో ఆసక్తికరమైన కార్ రేసుకు తెరలేచింది. ఇటీవలే వరల్డ్ ఫేమస్ టెస్లా కంపెనీ భారత్ లో ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు ప్రారంభించగా, ఇప్పుడు వియత్నాంకు చెందిన దిగ్గజ సంస్థ విన్‌ఫాస్ట్ కూడా రంగప్రవేశం చేసింది. విన్‌ఫాస్ట్ భారతదేశంలో తన కార్యకలాపాలను ప్రారంభించింది. గుజరాత్‌లోని సూరత్‌లో కంపెనీ తన మొదటి షోరూమ్‌ను ప్రారంభించింది. ఈ షోరూమ్‌లో విన్‌ఫాస్ట్ యొక్క ఎలక్ట్రిక్ ఎస్ యూవీ వేరియంట్‌లైన వీఎఫ్ 6 మరియు వీఎఫ్ 7 లను ప్రదర్శించింది. ఈ రెండు మోడళ్లకు జూలై 15 నుంచి రూ. 21,000 పూర్తి రిఫండబుల్ డిపాజిట్‌తో ప్రీబుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. విన్‌ఫాస్ట్ భారత్ ను తన ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తికి వ్యూహాత్మక మార్కెట్‌గా మరియు భవిష్యత్ హబ్‌గా భావిస్తోంది. తమిళనాడులోని తూత్తుకుడిలో రాబోయే తమ ప్లాంట్‌లో వాహనాలను స్థానికంగా అసెంబుల్ చేయనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఈ ఏడాది చివరినాటికి దేశవ్యాప్తంగా 32 షోరూంలను తెరిచేందుకు 13 డీలర్ల గ్రూపులతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఈ ఒప్పందంలో భాగంగా 27 నగరాల్లో 32 షోరూంలను తెరుస్తున్నది. తొలుత సూరత్ షోరూం ప్రారంభం కాగా, ఈ ఏడాదే హైదరాబాద్ షోరూం కూడా ప్రారంభం కానుంది,

**ఇవే షోరూం లు**

సూరత్ లో తొలిషోరూం ప్రారంభం కాగా, ఢిల్లీతోపాటు గురుగ్రామ్, నోయిడా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, పూణె, జైపూర్, అహ్మదాబాద్, కోల్‌కతా, కొచ్చిన్, భువనేశ్వర్, తిరువనంతపురం, ఛండీగఢ్, లక్నోల్లో డీలర్‌షిప్‌లను నెలకొల్పబోతున్నది. ఈ నగరాల్లో ఈవీ వాహనాలకు డిమాండ్ అధికంగా ఉన్నదని, ముఖ్యంగా మౌలిక సదుపాయాలు, చార్జింగ్ స్టేషన్లు అధికంగా ఉండటం వల్లనే వీటిని ఎంపికచేసినట్టు విన్‌ఫాస్ట్ ఆసియా సీఈవో ఫామ్ సన్హా చౌ తెలిపారు.

మధ్యతరగతి ఈవీ సెగ్మెంట్‌ను లక్ష్యంగా చేసుకుని వీఎఫ్ 6, వీఎఫ్ 7 మోడళ్ళను ప్రవేశపెడుతోంది.

విన్‌ఫాస్ట్ విఎఫ్ 6, విఎఫ్ 7 మోడల్స్

**అంచనా ధర:** రూ.18 లక్షల నుంచి రూ.24 లక్షలు.

**రేంజ్:** సుమారు 440 కి.మీ.

**విఎఫ్ 9 ఎలక్ట్రిక్ ఎస్ యువి ధర ఎంత కావచ్చు?**

విన్ఫాస్ట్ దీని ధర రూ. 65 లక్షల నుండి (ఎక్స్‌షోరూమ్) ఉండవచ్చు.

**విఎఫ్ 9 యొక్క సీటింగ్ సామర్థ్యం ఎంత?**

దీనిని 6 మరియు 7సీటర్ కాన్ఫిగరేషన్‌లలో పొందవచ్చు.

**విఎఫ్ 9 తో ఏ ఫీచర్లు అందించబడుతున్నాయి?**

ఇది 15.6అంగుళాల పెద్ద టచ్‌స్క్రీన్, 8అంగుళాల వెనుక స్క్రీన్, హెడ్స్ అప్ డిస్ప్లే, వైర్‌లెస్ ఫోన్ ఛార్జర్ మరియు 14స్పీకర్ సౌండ్ సిస్టమ్ వంటి సౌకర్యాలతో వస్తుంది. విఎఫ్ 9 లో యాంబియంట్ లైటింగ్, వెంటిలేషన్ మరియు హీటింగ్ ఫంక్షన్‌తో పాటు పవర్డ్ ఫ్రంట్ సీట్లు మరియు పెద్ద ఫిక్స్‌డ్ గ్లాస్ రూఫ్ కూడా ఉన్నాయి.

**విన్ఫాస్ట్ విఎఫ్ 9 ఎలక్ట్రిక్ ఎస్ యువి ఎంత సురక్షితం?**

ప్రయాణీకుల భద్రత పరంగా, ఇది 11 ఎయిర్‌బ్యాగ్‌లు, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్ (టిపిఎంఎస్), 360డిగ్రీ కెమెరా మరియు అధునాతన డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్ (అడాస్) యొక్క పూర్తి సూట్‌ను కలిగి ఉంటుంది.

**విన్ఫాస్ట్ విఎఫ్ కి ప్రత్యామ్నాయాలు ఏమిటి?**

విఎఫ్ యొక్క స్పెసిఫికేషన్లు, కియా ఈవీ9, బీఎండబ్ల్యు మరియు మెర్సిడెస్ బెంజ్ ఎస్ యువీ లతో సమానంగా ఉంచాయి.

# మీనాక్షి ప్లాన్ అదుర్స్!

(మొదటిపేజీ తరువాయి)

మీనాక్షి నటరాజన్ పాదయాత్ర చేయనున్నారు. అయితే వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం నుంచి ఈ పాదయాత్ర షురూ కానున్నట్లు తెలుస్తోంది. ఆందోల్, అర్మూర్, ఖానాపూర్, చొప్పదండి, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో పాదయాత్ర చేయనున్నట్లు ప్రకటించారు. మీనాక్షి నటరాజన్ పాదయాత్రకు సంబంధించి ఐదుగురు కోఆర్డినేటర్లను కాంగ్రెస్ నియమించింది. ఇకపోతే జూన్ 31న పరిగిలో ప్రారంభించి ఆగస్టు 6న వర్ధనపేటలో తొలివిడత పాదయాత్ర ముగిస్తుంది అని షెడ్యూల్‌లో పేర్కొంది.

**టీపీసీసీ కో ఆర్డినేటర్ల నియమకం..**

ఇందుకు సంబంధించి షెడ్యూల్ సైతం టీపీసీసీ ప్రకటించింది. ఏఐసీసీ ఆదేశం ప్రకారం ఈనెల 31 నుంచి పాదయాత్ర ప్రారంభించనున్నారు. ఈ పాదయాత్రలో శ్రమదానం కూడా చేయనున్నారు. ఈ పాదయాత్రలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తోపాటు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఆయా జిల్లాలకు చెందిన మంత్రులు, ఇన్‌చార్జిమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు ఈ పాదయాత్రలో పాల్గొననున్నారు. మీనాక్షి నటరాజన్ పాదయత్ర అండ్ శ్రమదానం కార్యక్రమానికి సంబంధించి టీపీసీసీ కో ఆర్డినేటర్లను సైతం నియమించంది. ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ థాకూర్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, డా.కేతూరి వెంకటేశ్, జూలూరు ధనలక్ష్మి, డా.పులి అనిల్ కుమార్‌లను టీపీసీసీ కో ఆర్డినేటర్లను నియమించింది. వీరంతా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పాదయాత్రను పర్యవేక్షించనున్నారు.

**రూట్ మ్యాప్ సైతం విడుదల..**

ఆరు నియోజకవర్గాల్లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పాదయాత్ర చేయనున్నారు. ఇందుకోసం రూట్ మ్యాప్ సైతం విడుదల అయ్యింది. తొలుత పరిగి సెగ్మెంట్ నుంచి పాదయాత్ర ప్రారంభిస్తారు. తొలి దఫాలో పరిగి, అందోల్, ఆర్మూర్, ఖానాపూర్, చొప్పదండి, వర్ధన్నపేట సెగ్మెంట్లలో పర్యటిస్తారు. ప్రతి ఉమ్మడి జిల్లాలోని ఒక నియోజకవర్గంలో పాదయాత్రతో పాటు రాత్రి బస చేయాలని ఆమె భావిస్తున్నారు. ఇలా రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాలను కవర్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం. ఇకపోతే పాదయాత్ర సాయంత్రం 5 గంటల నుంచి ప్రారంభమై 10 కిలోమీటర్ల వరకు పాదయాత్ర కొనసాగనుంది. రాత్రికి అక్కడే కాంగ్రెస్ కార్యకర్తలతో పల్లో నిద్ర చేయనున్నారు. ఆ మరుసటి రోజు తెల్లవారుజామున లేచి గ్రామంలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించనున్నారు.

# రాజకీయాలు పక్కనపెట్టి అందరూ కలిసి రండి



(మొదటిపేజీ తరువాయి)

ఐదుగంటలపాటు సాగిన సమావేశంలో ప్రధానంగా బీసీ రిజర్వేషన్లపైనే చర్చించామన్నారు. మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరిలతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ మంత్రి వర్గ సమావేశ వివరాలు వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై సుదీర్ఘంగా చర్చించింది. స్థానిక సంస్థలతో పాటు విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ గత మార్చి నెలలో శాసనసభలో ఆమోదించిన రెండు బిల్లులు గవర్నర్ గారి ద్వారా రాష్ట్రపతి కి పంపించడం జరిగింది. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర హైకోర్టు విధించిన గడువు సమీపిస్తుండగా, ప్రస్తుతం బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో నేరుగా కలిసి విజ్ఞప్తి చేయడానికి వీలుగా గౌరవ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అపాయింట్‌మెంట్ కోరాలని నిర్ణయించారు. రిజర్వేషన్ల సాధన కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఈ విషయంలో అన్ని పార్టీలు సహకరించాలని మంత్రిమండలి విజ్ఞప్తిచేసినట్లు మంత్రి పొన్నం తెలిపారు. తమతో అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా రాష్ట్రంలో కులగణన చేశామని అన్నారు. ఎన్నికలు ఆలస్యం అయితే..స్థానిక సంస్థల నిధులకు చాలా ఇబ్బంది అవుతుందని చెప్పారు. రాజకీయాలకు ఇది సమయం కాదని, సామాజిక న్యాయం కోసం అందరం కలిసికట్టుగా ప్రయత్నిద్దామన్నారు.

**బీసీ రిజర్వేషన్లపై కేసీఆర్ మౌనం**

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పంచాయతీ గట్టిగా నడుస్తోంది. కాంగ్రెస్, బీజేపీ దీనిపై గట్టిగా మాట్లాడుతున్నాయి. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కూడా మాట్లాడింది. ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ మాత్రం దీనిపై స్పందించలేదు. బీసీ లకు రిజర్వేషన్లు సాధ్యమైతదా? సాధ్యం కాదా? ప్రభుత్వం చేసేది రైటా? రాంగా? గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఏ ప్రయత్నం చేసిండు? ఇపుడు ఏం చేయాలి అని ఏదో ఒకటి చెప్పాలి కదా. ఏం చెప్పకుండా ఉంటే ఎట్ల? బీసీలు అక్కర్లేదా? బీసీలకు రిజర్వేషన్లు అక్కర్లేదా? అసలు గులాబీదళపతి, ప్రధానప్రతిపక్ష నేత ప్రతిస్పందన ఏంటి? అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. తెలంగాణ కేబినెట్ ఐదుగంటలకు పైగా చర్చించి ఢిల్లీతోనే తాడోపేడో తేల్చుకోవాలని డిసైడైంది. ఢిల్లీ పోరాటానికి కేసీఆర్ కలిసొస్తారా? బీసీ రిజర్వేషన్లపై ఆయన రాజకీయ వైఖరి రాజకీయపార్టీ అధినేతగా చెప్పాల్సిన అవసరముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఆపరేషన్ మహదేవ్ సక్సెస్..

### ముగ్గురు పహల్గాం ఉగ్రవాదుల హతం

### జమ్మూ కాశ్మీర్ ఎన్‌కౌంటర్‌లో చిక్కుకున్న ముష్కరులు

### పకడ్బందీ ప్రణాళికతో ముగ్గురిని మట్టుబెట్టిన భద్రతా బలగాలు

**జమ్మూ కాశ్మీర్, మహా:** జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. శ్రీనగర్‌లోని దాచిగమ్ నేషనల్ పార్క్ సమీపంలో కాల్పులు జరిగాయి. ఆపరేషన్ మహాదేవ్‌లో భాగంగా సైన్యం ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చింది. ఈ ముగ్గురు ఉగ్రవాదులలో పహల్గామ్ దాడికి సూత్రధారి అయిన ముసా కూడా ఉన్నాడు. ఈ ఎన్‌కౌంటర్ జ్వర్వాన్ రిడ్జ్, మహాదేవ్ రిడ్జ్ మధ్య ప్రాంతంలో జరిగింది. ఆపరేషన్ మహాదేవ్ పేరుతో జమ్మూకాశ్మర్ పోలీసులు, భారతసైన్యం, సీఆర్పీఎఫ్ సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టింది. హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నట్టుగా ఎప్పటినుంచో సమాచారం ఉంది. హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్లు నిఘా వర్గాల సమాచారంతో నెల రోజులుగా సైన్యం, పోలీసు బలగాలు గాలింపు కొనసాగించాయి. ఈ ఆపరేషన్ కోసం గత కొన్ని రోజులుగా దళాలు పకడ్బందీగా ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

**పకడ్బందీ ప్రణాళికతో..**


దాచిగామ్ అడవుల్లో రెండ్రోజుల క్రితం అనుమానాస్పద కమ్యునికేషన్లను భద్రతా దళాలు పసిగట్టాయి. దీనికి తోడు.. స్థానిక సంచార జాతుల వారు కూడా ఉగ్రవాదుల కదలికలపై భద్రతా దళాలకు సమాచారం అందించారు. సోమవారం చాలా బృందాలను సైన్యం ఆ ప్రదేశాలకు తరలించింది. ఉదయం 11.30 గంటల సమయంలో 24 రాష్ట్రీయ రైఫిల్స్, 4 పారా కమాండోల బృందం ముగ్గురు ఉగ్రవాదులను గుర్తించింది. ముష్కర మూక షాక్ నుంచి కోలుకొనేలోపే శరవేగంగా ఆపరేషన్ చేపట్టినట్లు తెలుస్తోంది. పహల్గామ్ దాడికి సూత్రధారి మూసా కూడా ఈ దాడిలో మరణించాడని చెబుతున్నారు. అయితే దీనిని సైన్యం ఇంకా ధృవీకరించలేదు. ఈ మొత్తం ఆపరేషన్‌కు సంబంధించిన సమాచారాన్ని సైన్యం త్వరలో వెల్లడించనుంది.

# ఆపరేషన్ సిందూర్ ఇంకా ఉంది

### కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్

### గట్టిగా తిప్పికొట్టాం- జై శంకర్: లోక్ సభలో చర్చ

(మొదటిపేజీ తరువాయి)



గట్టిగా తిప్పికొట్టాం- జై శంకర్

యుద్ధం ప్రారంభించడం తమ లక్ష్యంకాదని తేల్చి చెప్పారు. మన దేశానికి చెందిన ఎన్ని విమానాలు కూలాయనే ప్రశ్నల నేపథ్యంలో దేశ భద్రత విషయంలో చిన్న చిన్న విషయాలకు అంత ప్రాధాన్యత ఉండదని స్పష్టంచేశారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సైన్యానికి మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందనలు తెలిపారు. పహల్గాం ఉగ్రదాడికి బదులుగా ఆపరేషన్ సిందూర్ పేరుతో సైనిక ఆపరేషన్ చేపట్టామన్నారు. దేశ ప్రజలను రక్షించడం తమ ప్రభుత్వ బాధ్యత అని ఆయన అన్నారు. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి హేయమైన చర్య అని అభివర్ణించారు. ఉగ్రవాదులు పర్యటకుల్ని మతం పేరు అడిగి మరీ కాల్చి చంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఆపరేషన్ సిందూర్‌కు ముందు సైనికులు ముందు జాగ్రత్తలు తీసుకున్నారని తెలిపారు. పాకిస్థాన్‌లోని సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సైన్యం దాడులు జరిపిందని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌లో వందకు పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టామని తెలిపారు. మే 7 రాత్రి భారత బలగాలు తమ శక్తి, సామర్థ్యాలు చాటిచెప్పాయన్నారు. ఆపరేషన్ సింధూర్ ఇంకా ముగియలేదని, కారకులైన ప్రతి ఒక్కరూ మూల్యం చెల్లించాల్సిందేనన్నారు. ఉగ్రదాడికి గురైన దేశానికి తిప్పికొట్టే హక్కు ఉంటుందని భారత్ కూడా అదే పని చేసిందని విదేశాంగ మంత్రి జై శంకర్ అన్నారు. పాకిస్థాన్, ఉగ్రవాదులకు గట్టి సందేశం ఇవ్వాలనే ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్ర మౌలిక స్థావరాలను ధ్వంసం చేశామని ఆయన లోక్‌సభలో పేర్కొన్నారు. భారత్‌పాక్ మధ్య ఎలాంటి మధ్యవర్తిత్వం జరగలేదన్న ఆయన, అణ్వస్త్ర బ్లాక్ మెయిలింగ్‌కు భారత్ ఎప్పుడూ తలొగ్గదని వెల్లడించారు. దాడులు ఆపాలని పాక్ డీజీఎంవో ద్వారా అభ్యర్థన వచ్చిందని వివరించారు. ఐరాసలోని 193 దేశాల్లో 3 దేశాలు మాత్రమే పాక్‌కు అనుకూలంగా ఉన్నాయని జై శంకర్ అన్నారు.

# లోకల్‌బాడీ ఎన్నికల్లో బీసీలకు పెద్ద పీట

- **42 శాతం సీట్లు పక్కాగా వారికే కేటాయిస్తాం**
- **కొన్ని మండలాల్లో కులగణన అసలు జరగనే లేదు**
- **వచ్చే నెల 2న బీసీ రిజర్వేషన్లపై మహాధర్నా నిర్వహిస్తాం**
- **బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్ రావు హాట్ కామెంట్స్**



**హైదరాబాద్, మహా:** రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఇచ్చినా ఇవ్వకున్నా.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేస్తామని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. చిత్తశుద్ధితో బీసీల కోసం పనిచేసేది ప్రధాని నరేంద్ర మోదీనేనని స్పష్టం చేశారు. బీసీ కమిషన్ తీసుకొచ్చింది మోదీనేనని ఆయన తెలిపారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి మాట్లాడిన ఆయన.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఎంబీసీ చైర్మన్ పెట్టి రూ.1000 కోట్లు కేటాయిస్తామన్నారని గుర్తు చేశారు. కానీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. కేసీఆర్.. సమగ్ర కుల సర్వే చేశారు.. కానీ నివేదిక బయటపెట్టలేదని విమర్శించారు.

**నిజాలు ఎందుకు బయటపెట్టలేదు..**

తెలంగాణలో బీసీలు 52 శాతానికి పైగా ఉన్నారని, కేసీఆర్ కూడా 52 శాతం మంది కంటే ఎక్కువగా ఉన్నారని అసెంబ్లీలో నోరుజారారని, కానీ ఆయన 38 శాతం ఉన్నారని చెప్పాలని చూసి దొరికిపోయారన్నారు. ఇక కాంగ్రెస్ కుల గణన కొన్ని మండలాల్లో జరగనే లేదని, ఎలా పూర్తి చేశారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిజంగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తే నిజాలు ఎందుకు బయటపెట్టలేదని నిలదీశారు. అందుకే కేంద్ర ప్రభుత్వం, జన గణనతో పాటు కుల గణన కూడా చేపట్టనుందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం పక్కాగా ఓన్లీ బీసీలకే ఇస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు అని రామచందర్ రావు మండిపడ్డారు.

**బీసీ రిజర్వేషన్లపై మహాధర్నా..**

మోడీని కూడా కన్వర్టెడ్ బీసీ అని విమర్శలు చేస్తున్నారని రాంచందర్ రావు వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ కన్వర్ట్ అయ్యారు.. మోడీ కాదు అని వ్యాఖ్యానించారు. బీసీల సంక్షేమంపై కాంగ్రెస్ చేసేదంతా యాక్టింగే అని, వచ్చేనెల 2వ తేదీన ధర్నా చౌక్ వద్ద బీసీ రిజర్వేషన్లపై మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. బీసీల సంక్షేమం గురించి ఆలోచించే పార్టీ బీజేపీ మాత్రమే అని, కాంగ్రెస్ కేవలం ఓట్ల కోసమే ఆలోచిస్తుంది.. కానీ బీజేపీ ప్రజా సంక్షేమం గురించి ఆలోచిస్తుందన్నారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడంలో బీసీల పాత్ర కీలకం.. వారికి అంతేస్థాయిలో ప్రయారిటీ ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

# కేసీఆర్ ట్యాపింగ్ చేయలేదని వాంగ్మూలం ఇచ్చా..

### సీఎం రేవంతే సొంత నాయకుల ఫోన్లు ట్యాప్ చేస్తున్నట్లు చెప్పా

### సిట్ విచారణకు హాజరైన బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్




**హైదరాబాద్, మహా:** బీఆర్ ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ సోమవారం ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు హాజరై తన వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు చేతగాక సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిట్ ను వాడుకుంటుందన్నారు. అధికారులు మంచివాళ్లైనప్పటికి వారిని రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నాడని సిట్ అధికారులు చెప్పానన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా మంత్రుల, సొంత నాయకుల ఫోన్లను ట్యాప్ చేయిస్తున్నట్లుగా తాను సిట్ కు రాత పూర్వక ఫిర్యాదు చేశానన్నారు. సౌత్ పోస్టు పత్రిక కథనం కూడా అదే పేర్కొందన్నారు. డార్క్ వెబ్ టూల్స్, పెగాసెస్ వంటి సాఫ్ట్ వేర్ సహాయంతో సొంత కాంగ్రెస్ మంత్రుల, ఎమ్మెల్యేల, పారిశ్రామిక వేత్తల ఫోన్ లను, తమ ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నారని..దీనిపై కూడా విచారణ చేయాలని తాను సిట్ అధికారులను కోరడం జరిగిందని చెప్పారు.

# చెస్ క్వీన్‌గా దివ్య దేశ్ ముఖ్..

### ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా చరిత్ర

- తెలుగు తేజం కోనేరు హంపి ఓటమి
- మాస్టర్ హోదాను దక్కించుకున్న దివ్య



**స్పోర్ట్స్, మహా:** ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ ఫైనల్లో దివ్య దేశ్‌ముఖ్ సరికొత్త చరిత్ర సృష్టించింది. తెలుగు తేజం కోనేరు హంపిని 2.51.5తో ఓడించి.. మహిళల చెస్ ప్రపంచకప్ టైటిల్ గెలిచిన భారత తొలి క్రీడాకారిణిగా నిలిచింది. జార్జియాలోని బతూమీ వేదికగా సోమవారం జరిగిన టై బ్రేకర్‌లో హంపీ తొలుత నల్ల పావులతో ఆడగా.. దివ్యతో కలిసి డ్రా చేసుకుంది. పదిహేను నిమిషాల పాటు సాగిన గేమ్‌లో 81 ఎత్తుల తర్వాత ఇద్దరూ డ్రాకు అంగీకరించారు. అనంతరం పదిహేను నిమిషాల రెండో ర్యాపిడ్ మ్యాచ్‌లో 38 ఏళ్ల హంపి తెల్ల పావులతో ఆడగా.. దివ్య నల్ల పావులతో ఎత్తులు వేసింది. అయితే, ఈ టై బ్రేక్‌లో 38 ఏళ్ల హంపి చేసిన తప్పిదాల ఫలితంగా 19 ఏళ్ల దివ్య చాంపియన్‌గా అవతరించింది. ఇది ప్రారంభం మాత్రమేనని తాను భావిస్తున్నానని దివ్య దేశ్‌ముఖ్ భావోద్వేగంతో మాట్లాడారు. ఈ టోర్నమెంట్‌కు ముందు తనకు ఒక్క ప్రయాణం కూడా లేదని అన్నారు.

# నేనే లేకపోతే భారత్- పాక్ యుద్ధంలో ఉండేవి

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అదే పాత పాట

### ప్రపంచవ్యాప్తంగా ఆరు ప్రధాన యుద్ధాలను ఆపేశాను



**ఇంటర్నెట్ డెస్క్, మహా:** 'ఆపరేషన్ సిందూర్'పై చర్చ జరుగుతున్న వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదే పాత పాట పాడారు. తానే గనుక సకాలంలో జోక్యం చేసుకోకపోతే.. భారత్ పాకిస్థాన్‌లు ఈపాటికి యుద్ధంలో ఉండేవని వ్యాఖ్యానించారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో కలిసి ఆయన స్కాట్లాండ్‌లో మీడియాతో ఈ మేరకు మాట్లాడారు. ఇటీవల కాలంలో తాను ప్రపంచవ్యాప్తంగా ఆరు ప్రధాన యుద్ధాలను నివారించినట్లు చెప్పుకోవడం గమనార్హం. 'ప్రపంచ వ్యాప్తంగా అనేక చోట్ల కాల్పుల విరమణలు కొనసాగుతున్నాయి. నేనే లేకుంటే.. ఆరు పెద్ద యుద్ధాలు జరుగుతుండేవి. ఇందులో భారత్ పాకిస్థాన్ ఘర్షణ అతిపెద్దది. ఎందుకంటే.. ఇవి రెండూ అణ్వస్త్ర దేశాలు. ఒకవేళ అణ్వాయుధాలు ప్రయోగించుకుంటే.. యుద్ధం విస్తరించడం, అణుధూళి వ్యాప్తి వంటి దారుణ పరిస్థితులు నెలకొనేవి. ఇరుదేశాల నేతలు నాకు చాలా బాగా తెలుసు. యుద్ధం చేసుకోవాలనుకుంటే.. వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోనని చెప్పాను' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

ANN తెలుగు

మహా పత్రిక

03

మంగళవారం, హైదరాబాద్ | 29-07-2025 | జనరల్ వార్తలు | GENERAL NEWS | WWW.MAHAADAILY.COM


# పరిహారం ఎప్పుడిస్తారు?

- సిగాచీ ఘటన వివరాలు ఎందుకు దాచారు?
- కోటి రూపాయలు ఇస్తామన్న రేవంత్ రెడ్డి ఎప్పుడు ఇస్తారు?
- కంపెనీతో ఉన్న లాలూచి ఏమిటి? వెంటనే బయటపెట్టాలి
- ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు మండిపాటు



**సంగారెడ్డి, మహా:** అత్యంత తీవ్ర విషాదం నింపిన పాశమైలారంలో సిగాచీ పరిశ్రమ ఘోర ప్రమాదం లో మృతి చెందిన కుటుంబాలు పరిహారం వెంటనే ఇవ్వాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. బాధితులకు పరిహారం కోసం రేవంత్ రెడ్డికి డెడ్‌లైన్ విధించారు. ఆలోపు ఇవ్వకుంటే కలెక్టరేట్ ఎదుట బాధితులతో టెంట్ వేసుకుని కూర్చుంటామని హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్‌తో మాట్లాడి బాధితులకు రూ.కోటి పరిహారం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.సిగాచీ కంపెనీ ప్రమాద బాధితుల పక్షాన సంగారెడ్డి అదనపు కలెక్టర్‌ను సోమవారం కలిసి మృతదేహాలు అప్పగించ డంలో,పరిహారం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని మాజీ మంత్రి హరీశ్ రావు వివరించారు. 'సిగాచీ ఘటన జరిగి నెల కావొస్తున్నది. బాధిత కుటుంబాలు కన్నీళ్ల మధ్య నెల మాసికం చేసుకుంటు న్నారు. రేవంత్ రెడ్డి వచ్చి కోటి రూపాయలు ప్రకటిస్తే నెల గడిచినా ఒక్కటికి అందలేదు' అని హరీశ్ రావు వివరించారు. అంతిమ కార్యక్రమాలు జరిపేందుకు శవాలు కూడా ఇవ్వని దుస్థితి అని ఆవేదన వ్యక్తం చేశారు. బూడిదను తీసుకువెళ్లి గోదావరిలో కలుపు కున్నమని కన్నీరు పెట్టుకుంటున్నారని తెలిపారు.

**ప్రమాదం జరిగి నెల గడిచినా..**

'54 మంది చనిపోతే ప్రభుత్వ స్పందన అత్యంత దయనీయం, బాధ్యతారాహిత్యం. నష్ట పరిహారం, డెత్ సర్టిఫికెట్ ఎప్పుడు ఇస్తారని బాధితులు అడిగితే.. ఎస్ఐటీ ఘటనలో శవాలు కూడా రాలేదు, మీకు బూడిదైనా దొరికింది అని అత్యంత అమానవీయంగా మాట్లాడుతున్నారని చెబుతున్నా రు' అని మాజీ మంత్రి హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. 'కోటి రూపాయలు ఇస్తామన్న రేవంత్ రెడ్డి ఎప్పుడు ఇస్తారు? ఎవరు ఇస్తారని అడిగితే ఎవరూ చెప్పడం లేదు' అని తెలిపారు. తీవ్రంగా గాయప డినవారికి రేవంత్ రెడ్డి రూ.పది లక్షలు ఇస్తామని చెప్పి రూ.50 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు చెప్పారు. తీవ్రంగా గాయ పడిన వారికి రూ.50 లక్షలు ఇచ్చి, నెల నెలా వేతనం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగి నెల గడిచినా ఎంత మంది చనిపోయారు, ఎంతమంది క్షతగాత్రులు అధికారికంగా వెల్లడించ లేదని గుర్తుచేశారు.

**ఎందుకు గోప్యంగా ఉంచారు..**

'చనిపోయిన వారి పేర్లు, ఎవరెవరికి ఎంత ఇచ్చారు? క్షతగాత్రులకు ఎంత ఇచ్చారు? అనేది ఈ ప్రభుత్వం ఎందుకు దాచి పెడుతున్నది' అని ప్రశ్నించారు. ఇప్ప టివరకు నష్టపరిహారం వివరాలు వెల్లడించకుండా ఎందుకు గోప్యంగా ఉంచారు సమాధానం చెప్పాల ని రేవంత్ రెడ్డిని సవాల్ చేశారు. సిగాచీ కంపెనీలో పాత మిషన్ల వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని అనేకసార్లు కార్మికులు చెప్పినా, కంపెనీ పట్టించుకో లేదు. యాజమాన్యం పూర్తి నిర్లక్ష్యం ఉంది. ఎందుకు యాజమాన్యం మీద కేసు పెట్టలేదు' అని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు.

## మరో 20 ఏళ్లు మీరు అక్కడే మేము ఇక్కడే

### పార్లమెంట్‌లో కోపంతో ఊగిపోయిన అమిత్ షా



**న్యూఢిల్లీ,మహా:** కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్ల మెంట్‌లో కోపంతో ఊగిపోయారు. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్ గురించి వివరణాత్మక సమాధానం ఇస్తున్న సమయంలో ప్రతిపక్షాలు ఆయన ప్రసంగానికి అడ్డుతగులుతున్న తరుణంలో అమిత్ షా లేచి ప్రతిపక్ష సభ్యులపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. అమిత్ షా మాట్లాడుతూ.. ప్రతిపక్షాలు భారత విదేశాంగ మంత్రిని నమ్మకుండా వేరే దేశాన్ని నమ్ముతాయనే వాస్తవాన్ని నేను వ్యతిరేకి స్తున్నాను. వారి (కాంగ్రెస్) పార్టీలో విదేశీయుల ప్రా ముఖ్యతను నేను అర్థం చేసుకోగలను కానీ వారి పార్టీకి సంబంధించిన అన్ని విషయాలను ఇక్కడ సభలో రు ద్దకూడదు. అందుకే మీరు మరో 20 ఏళ్లు ప్రతిపక్షం లోనే ఉంటారు. "వారు మాట్లాడుతున్నప్పుడు, మేం ఓపికగా వింటున్నాం. నిన్న ఎన్ని అబద్ధాలు చెప్పారో నేను మీకు చెబుతాను. అయినప్పటికీ, విషం అనుకుని మేం అబద్ధాలు తాగాము. ఇప్పుడు మనం నిజం విన లేకపోతున్నాం. ఇంత తీవ్రమైన అంశం చర్చిస్తున్న ప్పుడు, విదేశాంగ మంత్రి మాట్లాడుతున్నప్పుడు, ప్రతిపక్షం అంతరాయం కలిగించడం సముచితమా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత విదేశాంగ మంత్రి మాట్లాడుతూ.. ప్రతిపక్ష నాయకుడు తన మొత్తం విద్యలో చరిత్రను అధ్యయనం చేయలేదని అన్నారు. 1950 లో పీవోకే సృష్టించబడిందని నేను అతనికి చెప్పాలనుకుంటున్నాను. చైనా, పాకిస్తాన్ 1966 లో ఉమ్మడి సైనిక శిక్షణను ప్రారంభించాయి. రాజీవ్ గాంధీ 1980 లో చైనా, పాకిస్తాన్ లను సంద ర్శించినప్పుడు, చైనా, పాకిస్తాన్ మధ్య అణు ఒప్పందం దాని శిఖరాగ్రంలో ఉంది. చైనాపాకిస్తాన్ సంబంధాల గురించి మమ్మల్ని హెచ్చరిస్తున్నారు. అయితే ఇది 60 సంవత్సరాలుగా కొనసాగుతోంది అని అన్నారు...

## ఖరీఫ్‌కు పుష్కలంగా విద్యుత్

### ఈ నెలలో రికార్డు స్థాయిలో నమోదవుతున్న డిమాండ్

**గతేడాది తో పోల్చుకుంటే 14.05 శాతం పెరిగిన పీక్ డిమాండ్**

**నిరంతర విద్యుత్ సరఫరా కు అప్రమత్తం గా ఉండండి**

**ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్**



**హైదరాబాద్, మహా :** గత ఏడాదితో పోల్చుకుంటే ఈ వర్షాకాలంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరు గుతున్నదని, రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశమున్నందున విద్యుత్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఇంధన శాఖ ముఖ్య కార్యద ర్శి నవీన్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ అధికారులతో సీఎండీ ముషారఫ్ ఫరూఖీతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో నవీన్ మిట్టల్ మాట్లాడుతూ, ముఖ్య మంత్రి, ఉప ముఖ్య మంత్రి విద్యుత్ శాఖ కు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, విద్యుత్ సరఫరాపై నిరంతర పర్యవేక్షిస్తున్నారన్నారు.

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో పారిశ్రామిక, వాణిజ్య రంగాలతో పాటు గృహ రంగంలో కూడా భారీ వినియోగం నమోదవుతుందని, దీనికి తోడు, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందుబాటులో ఉండటంతో లక్షలాది మోటర్లు నిరంతరం నడుస్తున్నా యన్నారు. ఫలితంగా వర్షాల సీజన్ లో కూడా భారీగా డిమాండ్ నమోదవుతున్నదని, గత ఏడాది (2024) జులై 31 న 13541 మెగావాట్లుగా నమోదయిన గరిష్ట డిమాండ్ ఈ ఏడాది జులై 16న 14.05 శాతం పెరుగుదలతో 15443 మెగావాట్లుగా నమోదయ్యిం దన్నారు. పుష్కలంగా వర్షాలు పడుతుండటంతో నీటి లభ్యత బాగా పెరిగిందని, వరి నాట్లు జోరందుకోవడం తో రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగే అవకాశముందన్నారు. ఈ నేపథ్యంలో సీఎండీ స్థాయి నుండి కింది స్థాయి సిబ్బంది వరకు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంతరాలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా ఈ వర్షాల సీజన్ లో అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా వుంటూ, వర్షాలు కురిసేటప్పుడు తప్ప నిసరిగా తమ కార్యాలయాల్లో అందుబాటులోనే ఉండి సరఫరా పర్యవేక్షించాలని నవీన్ మిట్టల్ అధికారుల ను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో టీజీఎస్ పీడీసీఎల్ డైరెక్టర్లు డా. నర్సింహులు, చక్రపాణి, కృష్ణా రెడ్డి, చీఫ్ ఇంజినీర్లు, సూపెరింటెండింగ్ ఇంజినీర్లు, డివిజనల్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ తప్పులను సరిదిద్దుతున్నాం

- ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టించింది
- నిధులు పక్కదారి పట్టించడం వల్లే గర్భిణీలకు అవస్థలు
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



**హైదరాబాద్, మహా:** గిరిజన సంక్షేమ శాఖ విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిది ద్దుతున్నామని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీ ణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లోని దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌లో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్, మంత్రి సీతక్క ఆధ్వర్యంలో 7 వ గిరిజన సంక్షేమ సలహా మండలి సమావేశం ప్రారంభమైం ది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్క దారి పట్టించిందన్నారు. ఆదివాసి గిరిజన ప్రాంతాలకు రోడ్లు బ్రిడ్జిలు అవసరం ..కానీ గతంలో నిధులు పక్కదారి పట్టించడం వల్ల గర్భిణీ ప్రసవ వేదన వంటి వార్తలు వస్తున్నాయన్నారు. ఏ ప్రభుత్వమైనా నిధులను పక్కదారి పట్టించవద్దని, ఎస్టీలకు కేటా యించిన నిధులను వారికి ఖర్చు చేయాలన్నారు. కేటాయించిన నిధులను అదే అసెంబ్లీ నియోజకవర్గం లో, అదే జిల్లాలో సర్దుబాటు చేయాలి తప్ప మైదాన ప్రాంతాలకు తరలించవద్దని సీతక్క పేర్కొన్నారు. సబ్ ప్లాన్ నిధులను పక్క దారి పట్టిస్తే ఏజెన్సీ ఏరియా వెనకబాటులోనే మగ్గిపోతుందన్నారు. అందుకే ఎస్టీల కు కేటాయించిన ప్రతి పైసా వారికి ఖర్చు చేయాలని, ఎస్టీల్లో ఎక్కువ మందికి ఉండటానికి ఇండ్లు లేవని, కాబట్టి ఎస్టీల ఇండ్ల నిర్మాణం కోసం బడ్జెట్ నిధులను పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నామని, ఎస్టీలకు ఇందిర మ్మ ఇండ్ల విషయంలో కనీస స్థల అర్హతను సడలించా లని డిమాండ్ ఉందని, సీఎం దృష్టికి తీసుకెళ్లి దాన్ని పరిష్కరిస్తామని మంత్రి సీతక్క తెలిపారు.

## ఏజీని కలిసిన మంత్రి దామోదర

### రాష్ట్ర విద్యార్థుల ప్రయోజనాలు కాపాడాలని వినతి

**హైదరాబాద్, మహా:** స్థానికత అంశంపై స్పష్టత కోసం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజన ర్సింహ, సమావేశం మధ్యలోనే ఏజీ సుదర్శన్‌రెడ్డిని కలిసేందుకు వెళ్లారు. రాష్ట్ర విద్యార్థుల ప్రయోజనాలు కాపాడాలని ఏజీకి మంత్రి విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు లో ఈ మేరకు వాదనలు వినిపించాలని సూచించారు. అవసరమైతే సీనియర్ న్యాయవాదుల సహకారం తీసు కోవాలని మంత్రి కోరారు. స్థానికులకే మెడికల్ సీట్లు దక్కేలా ప్రభుత్వం గతేడాది జీవో 33ను తీసుకొచ్చింది. అయితే స్థానిక కోటా సీట్లు తమకూ ఇవ్వాలని ఇతర రాష్ట్రాల్లో చదివిన విద్యార్థులు కోర్టును ఆశ్రయించారు. దీంతో స్థానికత అంశంపై సుప్రీంకోర్టులో వాదనలు కొనసాగుతున్నాయి. వచ్చేనెల 5న సుప్రీంకోర్టులో మరోసారి విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో సీఎం ఆదేశాల మేరకు మంత్రి, ఏజీని కలిసి, స్థానిక విద్యార్థుల ప్రయోజనాలు కాపాడాలని కోరారు.

## జైపాల్ రెడ్డికి భారతరత్న ఇవ్వాలి

### ప్రజల కోసం నిజాయితీగా పని చేసిన లీడర్

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**




**హైదరాబాద్, మహా:** దివంగత సీనియర్ నేత జైపాల్ రెడ్డికి భారతరత్న ఇవ్వాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయాల్లోకి వచ్చే యువత జైపాల్ రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జైపాల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా పీవీ ఎన్ఆర్ మార్గ్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. జైపాల్ రెడ్డి గురించి చెప్పే అంత పెద్ద స్థాయి నాది కాదని, ప్రపంచ దేశాలు గుర్తించే నాయకుడు ఆయన అన్నారు. అంగవైకల్యం ఉన్న కూడా విద్యార్థి నాయకుడి నుంచి జాతీయ నేతగా ఎదిగారని, దక్షిణ భారత్‌లో బెస్ట్ పార్లమెంటేరియన్‌గా ఎన్నికైన మొదట వ్యక్తి అని గుర్తు చేశారు. 'జైపాల్ రెడ్డి పెద్ద కుమారుడు అరవింద్ నేను ఇంజనీరింగ్ లో క్లాస్ మెట్. ఈ రోజు నేను ఈ స్థాయిలో ఉన్నాను అంటే ఆయన ప్రభావం కూడా ఉంది. ప్రపంచ స్థాయిలో మెట్రో వచింది అంటే అది జైపాల్ రెడ్డి కృషి. ప్రజల కోసం నిజాయితిగా పని చేసిన నాయకుడు. తెలంగాణ రావడంలో కీలక పాత్ర. ఆయన పార్లమెంట్ లో మాట్లాడే సమయంలో ఆయన వాడే ఇంగ్లీష్ పదాలు అద్భుతం అని' కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.

## హెపటైటిస్ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలి



**భూపాలపల్లి మహా :** హెపటైటిస్ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని ఇన్చార్జి జిల్లా వైద్యశాఖ అధికారిని శ్రీదేవి అన్నారు. సోమవారం ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా పిహెచ్సి భూపాల్ పల్లి లోసమావేశం నిర్వహించారు.హెపటై టిస్ కాలేయంకిఉండే వాపు.వివిధ రకాల వైరస్ల వల్ల ఏర్పడుతుంది. హెపటైటిస్ ABCDE వైరల్ రేపటిస్ గురించి ప్రజల్లో అవగాహన పెంచడం,పరీక్షలు,వ్యా క్సినేషన్ చికిత్స కు ప్రోత్సహించడం మరణాలను తగ్గించడమే లక్ష్యం అని ఇన్చార్జి జిల్లా వైద్యాధికారి శ్రీదేవి అన్నారు.వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, సురక్షిత నీరు,ఆహారం తీసుకోవడం,హెపటైటిస్ వ్యాక్సిన్ వేయించుకోవడం, రక్తమార్పిడి ముందు పరీక్ష చేయించుకోవడం, వల్ల దీనిని నివారించవ చ్చు. హెపటైటిస్ విచ్ఛిన్నం చేద్దాం 2030 నాటికి కాలేయాన్ని కాపాడుదాం హెపటైటిస్ని ఓడిద్దాం.. థీం హెపటైటిస్ ని విచ్ఛిన్నం చేద్దాం.. అని అన్నారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు,ఏ ఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఛార్జ్ తగ్గించాలని డిఎంకు విన్నవించిన బీజేపీ నాయకులు



**భూపాలపల్లి, మహా :** కాటారం నుండి భూపాలపల్లికి ఎక్స్ప్రెస్ బస్ ఛార్జ్ బాగా ఉందని తగ్గించాలని భూపాల పల్లి డిపో మేనేజర్ ఇందు కు బిజెపి భూపాలపల్లి జిల్లా అర్బన్ అధ్యక్షులు గీస సంపత్ కుమార్ విజ్ఞప్తి చేశారు. కాటారం నుండి భూపాలపల్లి కి 22 కి మీ దూరానికి ఎక్స్ప్రెస్ బస్సులో రూ 70 ఛార్జ్ చేస్తున్నారని , ఎక్స్ప్రెస్ బస్సు లో ఎక్కడ ప్రారంభించిన ఈ దూరానికి అంత చార్జ్ లేదని, గతంలో రూ 40 మాత్రమే ఉండేదని సంపత్ వినతిపత్రంలో పేర్కొన్నారు. బస్ ఛార్జ్ తగ్గించకుంటే బిజెపి తరపున పోరాటం చేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో దొంగల రాజేందర్, శ్యామ్, సుధాకర్, తోట రాజయ్య పాల్గొన్నారు.




## వరంగల్ నార్కోటిక్ డీఎస్పీగా రమేష్ కుమార్

**వరంగల్ మహా;** వరంగల్ నార్కోటిక్ పోలీస్ స్టేషన్ డీఎస్పీగా పీ. రమేష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించా రు. గతంలో చేసిన డీఎస్పీ కే. సైదులు టీజీఏఎన్ బీ హెడ్ ఆఫీస్ హైదరాబాద్ కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో నార్కోటిక్ పోలీస్ స్టేషన్ డీఎ స్పీగా పీ. రమేష్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ రవీందర్ తో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆగస్టు 3న ఒకే షిఫ్టులో నీట్ పీజీ ఎంట్రన్స్ పరీక్ష

### మరో 3 రోజుల్లోనే అడ్మిట్ కార్డులు విడుదల

**హైదరాబాద్, మహా :** దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీ ల్లో పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు నీట్ పీజీ 2025 పరీక్ష మరో వారంలో నిర్వహించనున్నారు. ఈ క్రమంలో నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) చురుగ్గా ఏర్పాట్లు చేస్తుంది. దేశ వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో ఆగస్టు 3న నీట్ పీజీ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ రోజున ఉదయం 9 గంటల నుంచి 12.30 గంటల వరకు జరిగే ఈ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షకు 4 రోజుల ముందు అంటే జులై 31వ తేదీన అడ్మిట్ కార్డులను వెబ్‌సైట్‌లోకి అందుబాటులోకి తీసుకువ స్తారు. పరీక్ష రోజున విద్యార్థులను 45 నిమిషాలకు ముందే ఎగ్జామ్ సెంటర్లలోకి అనుమతిస్తారు. దేశ వ్యాప్తంగా దాదాపు 2 లక్షల మందికిపైగా విద్యార్థులు నీట్ పీజీ రాయనున్నారు. తెలంగాణ నుంచి సుమారు 10 వేల మంది రాసే అవకాశం ఉన్నట్లు అంచనా. ఇందుకోసం తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ సహా మొత్తం 10 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశారు. పరీక్షల అనంతరం సెప్టెంబర్ 3 నాటికి ఫలితాలను విడుదల చేయనున్నట్లు మెడికల్ బోర్డు తెలిపింది. వా స్తవానికి జూన్ 15న రెండు షిఫ్టుల్లో ఈ పరీక్ష జరగాల్సి ఉండగా.. ఒకే షిఫ్టులో నిర్వహించాలంటూ సుప్రీంకో ర్టు ఆదేశించింది. దీంతో ఎన్‌బీఈఎంఎస్ ఆగస్టు 3కు పరీక్షను వాయిదా వేసింది. గతేడాది దేశంలోని అన్ని మెడికల్ కాలేజీల్లో మొత్తం 25,791 సీట్లను కేటా యించారు.



## శిక్షణతో యువతకు స్వయం ఉపాధి

# వాల్ పోస్టర్ ఆవిష్కరణ

### జాయింట్ కలెక్టర్ అశోక్ కుమార్

**భూపాలపల్లి మహా :** వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రాల ద్వారా యువతకు నైపుణ్యంగా శిక్షణ లభిస్తుందని రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రాల అడ్మిషన్లు గోడ పత్రికలు, కరపత్రాలను ఆవిష్కరించారు.వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రాలు యువత నైపుణ్యానికి నాణ్యతను అందిస్తూ, స్వయం ఉపాధి మరియు ఉద్యోగ, ఉపాధి అవకాశా లు కల్పన కేంద్రాలని ఉంటాయన్నారు.ఈ కేంద్రాలు యువతకు ఉపాధికి అనుగుణంగా అత్యాధునిక శిక్షణ ను అందిస్తాయని, నైపుణ్యం వల్లే భవిష్యత్ లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. యువత జిల్లాలోని ప్రభుత్వ ఐటిఐ మరియు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ATC) ఆధ్వర్యంలో 202526/27 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ నూతన కోర్సు లను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఏటిసి, ఐటీఐలో ప్రవేశాలకు 10 వతరగతి ఉత్తీర్ణులైన విద్యా ర్థిని, విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా https://iti.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తు చేయాలని, దరఖాస్తు ప్రక్రియ పూర్తిగా ఆన్లైన్ పద్ధతిలో ఉంటుందని తెలిపారు. ఈ కోర్సుల కాలవ్యవధి కోర్సులను బట్టి ఒకటి, రెండు సంవత్సరా లు ఉంటుందని అభ్యర్థులు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసే టప్పుడు 10వ తరగతి మార్కులు షీట్, ఆధార్ కార్డు మరియు పాస్‌పోర్ట్ సైజు ఫోటోను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు ప్రభుత్వ ఏటిసి భూపాలపల్లి కార్యాలయాన్ని కానీ 8985100563 నంబర్ కు కాల్ చేసి వివరాలు తెలుసుకోవాలని ఆయన వివరించారు. ఈ కార్యక్ర మంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, జిల్లా కమిటీ సభ్యులు జాయింట్ కమిషనర్ ఆఫ్ లెబర్ రాజేంద్రప్రసాద్, సహాయ కార్మిక అధికారి నారాయణ స్వామిలతో పాటు ఆర్డీఓ రవి, భూపాలపల్లి ఏటిసి ప్రి న్సిపాల్ జుమ్లా నాయిక్, భూపాలపల్లి, కాటారం, ఏటూరు నాగారం ప్రిన్సిపాళ్లు శేఖర్, జగన్ మోహన్ రెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ నువ్వో బచ్చా గానివి.. నీ పద్ధతి మార్చుకో..

**పదేళ్లు అధికారంలో ఉండి వందలాది మంది ఆత్మహత్యలకు కారణమైంది మీరు కదా..**

**పదేళ్ల మీ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసింది మీరు కాదా..**

**విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..**



**భూపాలపల్లి, మహా :** కేటీఆర్ నువ్వో బచ్చా గానివి.. నీ పద్ధతి మార్చుకో.., కనీస రాజకీయ అవగాహన లేని వ్యక్తివి నువ్వు మా (సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం) ప్రభుత్వాన్ని దున్నపోతు ప్రభుత్వమంటావా అని భూ పాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తీవ్ర స్థాయిలో ఎద్దేవా చేశారు. సోమవారం సాయంత్రం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యా లయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక కాంగ్రెస్ ముఖ్య నేతలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లా డుతూ.... పదేళ్లు అధికారంలో ఉండి వందలాది మంది ఆత్మహత్యలకు కారణమైంది మీ బీఆర్ఎస్ హయంలో కాదా అని ప్రశ్నించారు. పదేళ్ల మీ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసింది మీరు కాదా అని అన్నారు. మీ ప్రభుత్వ హయాంలో వేలాది ఎకరాల భూములను అప్పనంగా కొల్లగొట్టి లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డా రని అన్నారు. రాష్ట్రానికి దళిత ముఖ్యమంత్రి చేస్తానని మాటిచ్చి చేయలేదన్నారు. అదేవిధంగా, దళితులకు మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం లాంటి ఎన్నో అబద్ధపు హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన ప్రభు త్వం మీదన్నారు. భారతదేశంలో అబద్ధాలు పుట్టిందే కేసీఆర్, కేటీఆర్ ఇంట్లోనని అన్నారు. తనకు వ్యాపా రాలే లేవని మాజీ ఎమ్మెల్యే మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల్లో ఉన్న నీ వ్యాపారాల చిట్టా మొత్తం తీసి, పూర్తి వివరాలతో మీడియా ముందుకు త్వరలోనే వస్తానని ఎమ్మెల్యే అన్నారు. మీ పార్టీ (బీఆర్ఎస్) నేతలను, కార్య కర్తలను మేము (కాంగ్రెస్) వేధిస్తున్నామని అంటున్నా రు. మీ ప్రభుత్వ పాలనలో మా నాయకులు కోటగిరి సతీష్ గౌడ్, బండ శ్రీకాంత్, కురిమిళ్ల శ్రీనివాస్ లపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించింది మీరు కాదా అని ఎమ్మెల్యే అన్నారు. కాంగ్రెస్ వాళ్లవి ఇసుక ర్యాలీలు జరుగుతున్నాయని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మీ ప్రభుత్వ హయాంలో వడ్డేపల్లి (హన్మ కొండ) జీఎంఆర్ కట్టడాలకు ఇసుకను అక్రమంగా మొరంచపల్లి బ్రిడ్జి వద్ద డంప్ చేసి హన్మకొండ, హైద రాబాద్, భూపాలపల్లి కి లారీలల్లో తరలించింది.

## హైకోర్టుకు నలుగురు కొత్త న్యాయమూర్తులు

### ఆమోదం తెలిపిన కేంద్రం.. ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి



**హైదరాబాద్, మహా :** తెలంగాణ హైకోర్టులో నలుగురు కొత్త జడ్జిల నియామకానికి కేంద్రం ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు కోలీజియం సిఫా రసులను సోమవారం కేంద్రం ఆమోదించింది. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తు లుగా గాడి ప్రవీణ్‌కుమార్, చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గౌస్ మీరా మొహుద్దీన్ ప్రమాణం చేయనున్నారు. రాష్ట్ర హైకోర్టులో 42 మంది జడ్జిలు ఉండాలి. ప్రస్తుతం 26 మంది ఉన్నారు. కొత్తగా నలు గురిని నియామకంతో ఈ సంఖ్య 30కి చేరనుంది. అలాగే ఏపీ సహా మరో నాలుగు రాష్ట్రాల హైకోర్టుల కూ న్యాయమూర్తుల నియామకానికి కూడా కేంద్రం ఆమోదం తెలిపింది.రాష్ట్రపతి ఆమోదం లభించడం తో వీరంతా న్యాయమూర్తులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

Z కేటగిరి

## విలీనమూ-పుత్ర వాత్సల్యమూ !


# ఒక పరాజిత గాథ !!

"కొన్ని నెలల క్రితం కేటీఆర్ ఢిల్లీలో నా ఇంటికి వచ్చాడు. కవితతో సహా తమపై కేసుల విచారణ నిలిపివేస్తే బీఆర్ఎస్ పార్టీని బీజేపిలో విలీనం చేస్తామని,లేదా పొత్తు పెట్టుకోవడానికి అయినా సిద్ధమని ప్రతిపాదించాడు. విలీనం గురించి మా అధిష్టానంతో మాట్లాడి ఒప్పించాలని నన్ను రిక్వెస్ట్ చేశాడు.నేను కేటీఆర్ ప్రతిపాదనను బీజేపీ అగ్రనాయకత్వం ముందుంచాను. బిఆర్ఎస్ చరిత్ర ముగిసిపోయింది. ఆ పార్టీ విశ్వసనీయత కోల్పోయింది. జనం ఛీ కొట్టారు. ఒక్క పార్లమెంటు సీటు కూడా గెలుచుకోలేదు. ఆ పార్టీతో ఎలాంటి సంబంధం పెట్టుకునే ప్రసక్తి లేదని వాళ్ళు తేల్చి చెప్పారు. ఆ సంగతి కేటీఆర్ కు చెప్పాను. ఆరోజు కేటీఆర్ మా ఇంటికి వచ్చినప్పుడు సీసీ కెమెరాలలో రికార్డ్ అయిన వీడియోలు మీడియాకు విడుదల చేస్తాను'' అని బీజేపీ ఎంపీ సీఎం. రమేశ్ జూలై 26న మందుపాతర పేల్చారు.ఈ పేలుళ్లకు ఎర్రవల్లి ఫార్మ్ హౌజ్ లో ప్రకంపనలు వచ్చాయి.

రాజకీయాలలో ఉన్నవారందరూ అద్దాలమేడలో కూర్చున్నట్లేనన్న నానుడి ఉన్నది. కనుక ఎన్నడూ దారిన పోయేవారిపై రాళ్ళు విసరకూడదు. కానీ కేటీఆర్, హరీష్ రావు ఇద్దరూ రాళ్లు విసురుతునే ఉన్నారు. హైదరాబాద్ శివారులో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీలో రోడ్ కాంట్రాక్ట్ ఏపీ బీజేపి ఎంపీ సిఎం రమేష్ కు బహుమతిగా ఇచ్చారని,ఏపీ కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తూ తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. బిఆర్ఎస్ విలీనం అభ్యర్ధనని బీజేపీ అంగీకరించలేదనే అక్కసుతోనే తన గురించి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని సీఎం.రమేశ్ విమర్శించారు.రిత్విక్ కంపెనీ కూడా ఇతర కంపెనీలతో పాటు టెండర్లు వేసి కాంట్రాక్ట్ దక్కించుకుంది. అయినా కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణలో సాగునీటి ప్రాజెక్ట్ కాంట్రాక్ట్ పనులు ఆంధ్రా కాంట్రాక్టర్లకే ఇచ్చారు. ఆ వివరాలు కూడా చెప్పమంటే చెప్తానన్నారు.కేసీఆర్,కేటీఆర్ లకు పదవి,అధికారం చేతికి దక్కగానే అందరినీ మరిచిపోయారని రమేశ్ విమర్శించారు. కానీ సిఎం రేవంత్ రెడ్డితో తన స్నేహం ఈనాటిది కాదని,ఇద్దరం టీడీపిలో ఉన్నప్పటి నుంచి ఉందని బీజేపీ ఎంపీ తెలిపారు.స్నేహం ఉన్నంత మాత్రాన్న ఏ ముఖ్యమంత్రి కాంట్రాక్టులు తనకు నచ్చిన వారికి కట్టబెట్టలేరన్న సంగతి కేటీఆర్ కు తెలియదా అని ప్రశ్నించారు. కేసీఆర్ ఆవిధంగా కట్టబెట్టారా?అని ఇప్పుడు తనకు సందేహం కలుగుతోందని ఎంపీ అన్నారు.బిఆర్ఎస్ ఏం నిరూపించాలని భావిస్తుందని ప్రశ్నించారు.''కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు అమెరికా,మాల్దీవులు ఎందుకు వెళ్ళారో,ఎలా వెళ్ళారో నాకు తెలుసు.ఆ వివరాలు సీబీఐ, ఈ.డీలకు ఇస్తే మీ పరిస్థితి ఏమవుతుందో ఆలోచించండి'' అని సిఎం రమేష్ చెప్పారు.

బీఆర్ఎస్ పార్టీని బీజేపిలో విలీనం చేసే కుట్ర జరుగుతోందని మే మొదటివారంలో కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత బయటపెట్టారు. ఇప్పుడు సిఎం రమేష్ కూడా ఆ విషయాన్ని ధృవీకరించినట్లవుతోంది. కనుక బీఆర్ఎస్ పార్టీని బీజేపిలో విలీనం చేయడానికి కేసీఆర్, కేటీఆర్ సిద్ధపడ్డారని స్పష్టమవుతోంది. ఇటీవల కేటీఆర్ అర్ధరాత్రి రహస్యంగా హైదరాబాద్‌లో ఏపీ మంత్రి నారా లోకేష్ ఇంటికి వెళ్ళి కలిశారని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం కోసమే నారా లోకేష్‌ను సంప్రదించినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నవి. తెలంగాణలో ఓ వైపు కాంగ్రెస్ పార్టీ, మరోవైపు బీజేపి,టీడీపి, జనసేన కూటమి పోటీ చేస్తే బీఆర్ఎస్ అడ్రస్ లేకుండా పోతుందని భయపడి తరుణోపాయం కొరకు నారా లోకేష్‌ని కలిశారని ఒక ప్రచారం సాగుతోంది. నారా లోకేష్ మాత్రమే ఈ అంశంపైసమాధానం చెప్పగలరు. ఈ భేటీ గురించి కేటీఆర్ స్పష్టంగా చెప్పకుండా దాటవేశారు.తాను లోకేశ్ ను కలవలేదని అంటూనే కలిస్తే తప్పేముంది అని కేటీఆర్ జవాబిచ్చారు.లోకేష్ కూడా సిఎం రమేష్‌లాగ అసలు విషయం చెబితే బీఆర్ఎస్ గుట్టురట్టవుతుంది. ఈ మాటలు,విమర్శలు,రహస్య భేటీలు చూస్తే బీఆర్ఎస్ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టుగా పరిశీలకులంటున్నారు. కేటీఆర్, హరీష్ రావు పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని కూడా చెబుతున్నారు.

''బీజేపీలో బీఆర్ఎస్ విలీనం లేదు.తప్పుడు వార్తలు ప్రసారం చేసిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటాం'' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 2024 ఆగస్టు 7 న హెచ్చరించారు.బీఆర్ఎస్ పార్టీ పైన,విలీనం లాంటి ఎజెండా పూరిత దుష్ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలు,వ్యక్తులు వెంటనే ప్రజలకు వివరణ ఇవ్వాలని,లేదంటే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు.''24 సంవత్సరాలుగా ఇలాంటి అనేక కుట్రలు,కుతంత్రాలు, కుట్రదారులను ఎదుర్కొన్న పార్టీ మాది.ఇవన్నీ దాటుకొని 24 ఏండ్ల పాటు నిబద్ధతతో, పట్టుదలతో అవిశ్రాంతంగా పోరాడి తెలంగాణ సాధించిన పార్టీ బీఆర్ఎస్.సాధించుకున్న తెలంగాణ సగర్వంగా నిలబెట్టుకొని, అభివృద్ధిలో అగ్రపథాన నిలిపాము'' అని కేటీఆర్ తెలిపారు.ఆత్మగౌరవం, అభివృద్ధిని పర్యాయపదాలుగా మార్చుకొని ఇతర రాష్ట్రాలకి ఆదర్శంగా ఉండేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దామన్నారు. కోట్లాది గొంతుకలు, హృదయాలు తెలంగాణ ఆత్మగౌరవం, తెలంగాణ గుర్తింపు కోసం పోరాడుతున్నాయి కాబట్టే ఇది సాధ్యమైందని చెప్పారు.ఎప్పటిలానే బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల కోసం నిలబడుతుందని,పోరాడుతుందని కేటీఆర్ చెప్పారు.''పడతాం,లేస్తం,తెలంగాణ కోసమే పోరాడుతాం.కానీ తలవంచం. ఎన్నటికైనా ఎప్పటికైనా'' అని కేటీఆర్ తేల్చిచెప్పారు.



> రాజకీయాలలో ఉన్నవారందరూ అద్దాలమేడలో కూర్చున్నట్లేనన్న నానుడి ఉన్నది. కనుక ఎన్నడూ దారిన పోయేవారిపై రాళ్ళు విసరకూడదు. కానీ కేటీఆర్, హరీష్ రావు ఇద్దరూ రాళ్లు విసురుతునే ఉన్నారు.హైదరాబాద్ శివారులో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీలో రోడ్ కాంట్రాక్ట్ ఏపీ బీజేపి ఎంపీ సిఎం రమేష్ కు బహుమతిగా ఇచ్చారని,ఏపీ కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తూ తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. బిఆర్ఎస్ విలీనం అభ్యర్ధనని బీజేపీ అంగీకరించలేదనే అక్కసుతోనే తన గురించి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని సీఎం.రమేశ్ విమర్శించారు.

బిఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత డీలా పడిపోయింది. ప్రజలతో పనేం ఉన్నదన్నట్లు ప్రధాన నేతలు అంతా సైలెంట్ అయిపోయారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు తప్పించి మిగిలిన నాయకులు భూతద్దం పెట్టి వెదికినా క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు.కేసీఆర్ ఫార్మ్ హౌజ్ కు పరిమితం కావడం ఆ పార్టీకి భారీ నష్టం కలిగిస్తున్నది.నూటికి 90 శాతం మంది బిఆర్ఎస్ నేతలు ప్రజల్లో కనిపించడం లేదని జిల్లాల నుంచి సమాచారం అందుతున్నది.ముఖ్యనేతలు కేటీఆర్, హరీశ్‌రావు పర్యటనల్లో హడావుడి చేస్తున్న నేతలు ఆ తర్వాత క్యాడర్‌కు అందుబాటులో ఉండటం లేదు.ముఖ్యంగా పార్టీని నడిపే విషయంలో హైకమాండ్ నుంచి ఎలాంటి దిశానిర్దేశం లేకపోవడంతోనే బీఆర్ఎస్ నేతలు ఇలా ఇళ్లకే పరిమితమవుతున్నారనే టాక్ కూడా వినిపిస్తోంది.2014లో తొలిసారి అధికారంలోకి వచ్చిన నుంచి 2023 వరకు దాదాపు పదేళ్లు బిజీబిజీగా ఉండేవారు.అధినేత కేసీఆర్ కూడా ఎమ్మెల్యేలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడంతో జిల్లాల్లో నిత్యం బీఆర్ఎస్ హడావుడి కనిపించేది.అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్‌లో మునుపటి పోరాట పటిమ కనిపించడం లేదు.

పార్టీ కార్యక్రమాల నిర్వహణలో హైకమాండ్‌కే స్పష్టమైన విధానం లేకపోయిందనే ఆరోపణలు వస్తున్నాయి.రాష్ట్రంలో అధికార కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ప్రతిపక్ష స్థానంలో బీఆర్ఎస్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడం లేదన్న విమర్శలున్నవి. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడే విషయంలో బీజేపీ నుంచి బీఆర్ఎస్ గట్టి సవాలే ఎదుర్కొంటున్నది. ఎన్నికల్లో ఓటమిపై చాలా నియోజకవర్గాల్లో ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదంటే బీఆర్ఎస్ పరిస్థితి ఏ విధంగా తయారైందో అర్థం చేసుకోవచ్చు.అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోగానే అస్త్రసన్యాసం చేసినట్లు బీఆర్ఎస్ నేతలు వ్యవహరించినందున పార్లమెంటులో ఖాతా తెరవలేదు. గతంలో ప్రోత్సహించిన వలసలు కూడా ఇప్పుడు పార్టీని ఇబ్బందికి గురిచేస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. అవసరం ఉన్నా, లేకపోయినా గతంలో కాంగ్రెస్ నుంచి వలసలను ప్రోత్సహించడం,ఎన్నికల ముందు వర్గ విభేదాలకు కారణమైందని విశ్లేషణలున్నవి. ఇక అధికారం కోల్పోయిన తర్వాత సొంత పార్టీ వారితోపాటు వలస వచ్చిన నేతలు తిరిగి కాంగ్రెస్ గూటికి చేరిపోవడంతో చాలాచోట్ల పార్టీ దెబ్బతిన్నదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

''కవితపై కేసులు ఎత్తేస్తే బీజేపీలో బీఆర్ఎస్ విలీనం చేస్తామంటూ సీఎం రమేశ్ ఎదుట కేటీఆర్ చేసిన ప్రతిపాదన ముమ్మాటికీ వాస్తవమే.నేనే వేదిక ఏర్పాటు చేసి సీఎం రమేశ్ ను తీసుకొస్తా.డేట్ , టైం ఫిక్స్ చేయ్. దమ్మెంటే చర్చకు రా.ఎవరిది తప్పో తేలుద్దాం''అని కేటీఆర్ కు,కేంద్రమంత్రి బండి సంజయ్ సవాల్ విసిరారు.''బీజేపీ కుటుంబ వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకం.అవినీతి పార్టీలకు బీజేపీ దూరం.మరి అయ్యా,కొడుకు,బిడ్డ,అల్లుడుతో నడిచే కుటుంబ పార్టీ బీఆర్ఎస్.అవినీతి,అక్రమాలతో తెలంగాణను దోచుకున్న పార్టీ బీఆర్ఎస్.సంకుచిత రాజకీయాలతో ప్రజల మధ్య ద్వేషం పెంచి రాజకీయ లబ్ది పొందాలనుకునే పార్టీ బీఆర్ఎస్. అట్లాంటి పార్టీతో మేం ఎందుకు పొత్తు పెట్టుకుంటాం? సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిజామాబాద్ ఎన్నికల ప్రచారంలో ఇదే విషయం చెప్పారు.నా కొడుకును సీఎం చేస్తా.మీ ఆశీర్వాదం ఉండాలని కేసీఆర్ అడిగితే వారసత్వ రాజకీయాలను మేం వ్యతిరేకం. వాటిని ప్రోత్సహించను.అని కరాఖండిగా చెప్పారు'' అని బండి సంజయ్ గుర్తు చేశారు.

''కేటీఆర్ కు అహంకారం తగ్గలేదు.ముఖ్యమంత్రి పదవికి కనీస గౌరవం ఇవ్వాలనే సోయి లేకుండా హౌలే,వాడు,నీ బొంద అని మాట్లాడుతున్నడు.కనీస సంస్కారం లేకుండా అడ్డగోలుగా మాట్లాడుతున్నడు. సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నడు.కాంగ్రెసోళ్లకు సిగ్గు లేదు.చేతకాని దద్దమ్మలు.కానీ ప్రధానిని,బీజేపీ నేతలను దూషిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు.మా కార్యకర్తలే నీ సంగతి చూస్తారు.అడ్డగోలుగా సంపాదించిన సొమ్ముతో బలిసి సోషల్ మీడియా ద్వారా ఇష్టానుసారం రాయిస్తూ మాపై దుష్ప్రచారం చేస్తున్నాడు. నేను హోంశాఖ సహాయ మంత్రిని.అయినా కేటీఆర్ హద్దులు దాటిపోయి వ్యవహరిస్తున్నారు'' అని కూడా కేంద్రమంత్రి అన్నారు.

''బిఆర్ఎస్‌ను గంపగుత్తగా బిజెపికి అప్పగించే ప్రయత్నం జరుగుతున్నది.నేను జైలులో ఉన్నప్పుడే ఈ ప్రతిపాదన వస్తే వ్యతిరేకించా. తొందరపాటు నిర్ణయం వద్దని కెసిఆర్‌కు సూచించా.బిజెపిలో బిఆర్ఎస్ విలీనం కాకుండా స్వతంత్రంగా ఉండాలన్నదే నా అభిమతం. ఆరు నెలలు కాదు,ఆరు సంవత్సరాలు అయినా జైల్లో ఉంటానని చెప్పాను.బిఆర్ఎస్ పార్టీలో కెసిఆర్ మాత్రమే నాకు నాయకుడు. , ఆయన నాయకత్వంలోనే పనిచేస్తా'' అని గత మేలో ఎమ్మెల్సీ కవిత అన్నారు.ఎల్కతుర్తిలో ఏప్రిల్ 27 న పార్టీ రజతోత్సవ సభ తర్వాత పార్టీలో అసమ్మతి,తిరుగుబాట్లు కనిపిస్తున్నవి.'భౌగోళిక తెలంగాణ సాధించాం కానీ సామాజిక తెలంగాణను సాధించుకోలేకపోయాం' అని కవిత ధిక్కార స్వరం వినిపించిన నాటి నుంచే సమస్యలు మొదలయ్యాయి.ఆమె తన సోదరుడు,పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను టార్గెట్ చేసి మాట్లాడుతున్నారు.

''నాపై దుష్ప్రచారం చేస్తున్నా పార్టీ స్పందించడం లేదు. నన్ను పార్టీ నుంచి ఎవరు బయటకు పంపుతారు..? అంత సీన్ లేదు. వెన్నుపోటు పొడవడం నా లక్షణం కాదు.నేను నేరుగానే పోరాడతా.కొత్త పార్టీ అవసరం లేదు.ఉన్న పార్టీని బాగా చేసుకుంటే చాలు'' అని ఆమె అన్నారు.బిఆర్ఎస్ అధినేత,మాజీ సిఎం,తన తండ్రి కెసిఆర్‌ను తాను లేఖ ద్వారా అంతర్గతంగా ఇచ్చిన ఫీడ్‌బ్యాక్ ఎలా లీక్ అయిందని ఎంఎల్‌సి కవిత ప్రశ్నించారు.లేఖలో తాను చేసిన సూచనల్లో ఒక్కటైనా తప్పుందా..? అని కవిత ప్రశ్నించారు. తమ పార్టీ వాళ్ళలో కొందరు,సోషల్ మీడియాలో మహాభారతం క్యారెక్టర్లు వేస్తున్నారని పేర్కొన్నారు.వరంగల్ సభ తన వల్లనే సక్సెస్ అయిందని కొందరు ఊహించుకుంటున్నారని పరోక్షంగా కేటీఆర్ పైనే ఆమె దాడి చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి,పదేళ్లు పాలించిన కెసిఆర్‌కు నోటీసులు ఇస్తే,కేవలం ట్విట్టర్‌లో పోస్టు పెట్టి వదిలేస్తే ఎలా..? అని కేటీఆర్ పై విమర్శలు గుప్పించారు.గ్రామస్థాయి నుంచి ఆందోళనలు చేపట్టేందుకు ఎందుకు కార్యాచరణ తీసుకోలేదని ఆమె నిలదీశారు. తనను కాంగ్రెస్ కోవర్ట్ అంటున్నారని,మరి బిఆర్ఎస్‌లో బిజెపి కోవర్టులు ఉన్నారనుకోవాలా? అని కవిత సందేహం వ్యక్తం చేశారు.

తెలంగాణ జాగృతి ఉద్యమ సంస్థను బలోపేతం చేసే దిశగా ఆమె అనేక కార్యక్రమాలను చేపడుతున్నారు. విస్తృతంగా జిల్లాలు కూడా పర్యటిస్తున్నారు.' లీడర్' పేరిట నాయకత్వ శిక్షణ శిబిరాలను నిర్వహించారు. సాంస్కృతిక,సమకాలీన అంశాలపై బలంగా పోరాడాలని కవిత పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ పార్టీ చేయాల్సిన సగం పనులను జాగృతి తరపున చేస్తున్నామని కవిత ప్రకటించారు. తాను ఎంపీగా పోటీ చేస్తే సొంత పార్టీ ఎంఎల్ఏలే కుట్రపూరితంగా ఓడించారన్న ఆవేదన ఆమెకుంది. ఇదే విషయాన్ని కెసిఆర్ కు ఫిర్యాదు చేసినా ఆయన నిర్లక్ష్యం చేశారన్న బాధను కూడా ఆమె కొన్ని సందర్భాలలో వ్యక్తం చేశారు.

బిజెపిలో బిఆర్ఎస్ విలీనం చర్చలను కేటీఆర్ తోసిపుచ్చారు. తెలంగాణ ఉన్నంత వరకు బీఆర్ఎస్ నిలుస్తుందని ఆయన ప్రతిజ్ఞ చేశారు. బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ ఆరోపణలు నిరాధారమైనవని అన్నారు. జూలై 27 న ఆయన భూపాలపల్లి జిల్లా పర్యటన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు.ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో కవితకు బెయిల్ హామీ ఇస్తే,బిజెపిలో బిఆర్ఎస్‌ను విలీనం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్టుగా ప్రతిపాదించినట్లు సీఎం.రమేశ్ చెప్పడాన్ని ఖండించారు. అయితే నిరాధార ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీపై ఎలాంటి చర్యలకు బిఆర్ఎస్ పార్టీ పూనుకుంటుందో కేటీఆర్ తెలియజేయలేదు.సీఎం.రమేశ్ ను అసలు తాను కలవలేదన్న అంశంపై కూడా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ స్పష్టత ఇవ్వలేదు.ఇందుకు గల కారణాలేమిటో తెలియదు. బిఆర్ఎస్ ఇక ఎంతోకాలం మనజాలదని బీజేపీలో విలీనం జరగడమో లేదా అసెంబ్లీ ఎన్నికల వేళ పొత్తులు పెట్టుకోవడమో జరుగుతుందని ఆ పార్టీ కార్యకర్తల్లోనే ఒక ప్రచారం బలంగా సాగుతోంది.

''దేశంలో ఎక్కడా జరగని దిక్కుమాలిన కుమ్మక్కు రాజకీయం తెలంగాణలో జరుగుతున్నది.సీఎం రేవంత్,ఎంపీ రమేశ్ బాగోతం నేను బయటపెట్టడంతో కుడితిలో పడిన ఎలుకలా ఇద్దరూ కొట్టుకుంటున్నారు. అటెన్షన్ డైవర్షన్ కు పనికి రాని కథలు చెబుతున్నారు. కుంభకోణాల నుంచి అటెన్షన్ డైవర్షన్ చేసేందుకు బీజేపీలో విలీనం అనే పనికిరాని,పస లేని చెత్త అంశాన్ని మళ్లీ తెరపైకి తెస్తున్నరు. తెలంగాణ ప్రజల కోసం పుట్టిన పార్టీ.తెలంగాణ ప్రజల కోసం పోరాడే పార్టీ..ఎప్పటికీ ఏ పార్టీలో విలీనమయ్యే ప్రసక్తే లేదు. తాము ఇరకాటంలో పడిన ప్రతిసారి,ఇటు కాంగ్రెస్,అటు బీజేపీ పనికి రాని చెత్త అంశాన్ని తెరపైకి తెచ్చి తెలంగాణ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారు'' అని కేటీఆర్ జూలై 26వ తేదీ రాత్రే ఎక్స్ లో పోస్టు పెట్టారు.ఆ ట్వీట్ లోనూ తాను సీఎం.రమేశ్ ఇంటికి వెళ్లలేదని,అదంతా అభూతకల్పన అని చెప్పలేదు.

కేటీఆర్ తన ఇంటికి వచ్చి విలీన ప్రతిపాదనలపై మాట్లాడిన విషయం తన ఇంట్లోని సీసీటీవీలో రికార్డు అయినట్టు రమేశ్ చెబుతున్నందున ఈ అంశాన్ని దాటవేయాలన్న నిర్ణయమే బెటర్ అని కేటీఆర్ అనుకుంటూ ఉండవచ్చు.లేదా అలాంటి సలహా కొడుక్కి,కేసీఆర్ ఇచ్చి ఉండాలి.కేసీఆర్ కు తెలియకుండా,ఆయన చెప్పకుండా కేటీఆర్ బీజేపీతో రాయబార కార్యక్రమానికి పూనుకొని ఉంటారని ఎవ్వరూ అనుకోవడం లేదు.తన కూతురు కవిత లిక్కర్ కుంభకోణంలో చిక్కుకోగానే బిఆర్ఎస్ అధినేత తీవ్రంగా కలవరపడి ఉండవచ్చు. ముమ్మందు తమపై కూడా సిబిఐ లేదా ఇతర జాతీయ దర్యాప్తు సంస్థలు దాడులు జరపవచ్చునని ఆయన అంచనా వేసి ఉండవచ్చు.అందువల్ల బీజేపీతో 'స్నేహ సంబంధాల పునరుద్ధరణ'కు ప్రణాళికను రచించారని తెలియవచ్చింది.అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ఉన్నా,లేదా ముగ్గురు,నలుగురు లోక్ సభ సభ్యుల బలం ఉన్నా బిఆర్ఎస్ పట్ల బీజేపీ వైఖరిలో కొంత మార్పు కనిపించేది.'అయిపోయిన పార్టీ'తో పనేమిటి అని బీజేపీ నాయకత్వం అభిప్రాయపడేది కాదేమో! బీజేపీ ఎంపీ సీఎం.రమేశ్,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కుమ్మక్కు అయి ఇలాంటి నిరాధార ఆరోపణలు చేసి ఉంటే,బిఆర్ఎస్ పార్టీ ఖచ్చితంగా పరువునష్టం దావా వేసి కోర్టుకు ఈడ్వాలని పాతికేండ్లుగా ఆ పార్టీలో నిబద్ధతతో పనిచేస్తున్న నాయకుడొకరు అన్నారు.అలా చేయని పక్షంలో బిఆర్ఎస్ బీజేపీ బంధంపై జనంలో అనుమానాలు మరింతగా పెరుగుతాయని ఆయన చెప్పారు.



- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

> బీఆర్ఎస్ పార్టీని బీజేపిలో విలీనం చేసే కుట్ర జరుగుతోందని మే మొదటివారంలో కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత బయటపెట్టారు. ఇప్పుడు సిఎం రమేష్ కూడా ఆ విషయాన్ని ధృవీకరించినట్లవుతోంది. కనుక బీఆర్ఎస్ పార్టీని బీజేపిలో విలీనం చేయడానికి కేసీఆర్, కేటీఆర్ సిద్ధపడ్డారని స్పష్టమవుతోంది.ఇటీవల కేటీఆర్ అర్ధరాత్రి రహస్యంగా హైదరాబాద్‌లో ఏపీ మంత్రి నారా లోకేష్ ఇంటికి వెళ్ళి కలిశారని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం కోసమే నారా లోకేష్‌ను సంప్రదించినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నవి.

ఇదిలా ఉండగా తెలంగాణవాదాన్ని తలకెక్కించుకున్నట్టు క్లయిమ్ చేసుకునే బుద్ధిజీవులు తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టే ప్రయత్నమే చేస్తున్నారు.కేటీఆర్ ప్రాయోజిత సంస్థలుగా విమర్శలకు గురవుతున్న తెలంగాణ వికాస సమితి,తెలంగాణ పరిరక్షణ వేదిక తెలంగాణవాదాన్ని మాత్రమే ముందుకు తీసుకుని వెళ్తున్నాయి.ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తున్నాయి.తెలంగాణ వ్యతిరేకి,తెలంగాణ ద్రోహి, ప్రలోభపడి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వత్తాసు పలికే వ్యక్తి అనే ముద్రలు వేసే హక్కు తమకు సంక్రమించినట్టు ఆ సంఘాలు చెప్పుకుంటున్నాయేమో?తెలంగాణ సెంటిమెంట్ మాత్రమే కేసీఆర్ ను అధికారంలోకి వచ్చింది.2018 లో కాంగ్రెస్,తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకోవడం వల్ల తెలంగాణ భావోద్వేగాన్ని రెచ్చగొట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు తెలంగాణపై ఆధిపత్యం సాధిస్తారనే ప్రచారం ప్రజల్లోకి వెళ్లింది. సహజంగానే చంద్రబాబుపై తెలంగాణ ప్రజల్లో ఉన్న వ్యతిరేకత కేసీఆర్‌కు ఉపయోగపడిరది.అయితే, మూడో ఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ఓటమిపాలై కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు.

ఇప్పుడు రేవంత్ రెడ్డి,చంద్రబాబుకు బానిస అని,బానిస అని ఆయన ఏపీ ప్రయోజనాలకోసమే పనిచేస్తున్నారని పరిరక్షణ వేదికలు,వికాస వేదికలు విమర్శలు కురిపిస్తున్నవి.కేసీఆర్ పాలనలో జరిగిన తప్పులను ఎత్తిచూపి తెలంగాణ అస్తిత్వ పరిరక్షణకు ఒక ఉద్యమాన్ని నిర్మించే ప్రయత్నం ఆ సంఘాలు చేయవు.వాటి ఎజండా ఎలాగైనా సరే,కేసీఆర్ మరలా ముఖ్యమంత్రి కావాలి.కేసీఆర్ పాలనలో జరిగిన భూమాయ గురించి ఆయా స్పాన్సర్డ్ సంఘాలు మాట్లాడవు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు భూములు ఎవరి చేతుల్లోకి మారాయో అర్థమైతే కేసీఆర్ పాలనను జనం అసహ్యించుకుంటారు. కేసీఆర్ పాలనకు ప్రజలు 2023 చివరలో అంతం పలికారు. కేసీఆర్‌ను ఓడించాలనే ప్రజల పట్టుదల వల్లనే కాంగ్రెస్ గెలిచింది.

కేసీఆర్ తన పాలనతో తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ కోసం ఏ మాత్రం పనిచేసినా ఫలితం మరో రకంగా ఉండేది.కేవలం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి అత్యంత సన్నిహితుడు కావడం వల్ల రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఎలా నిర్ధారణకు రాగలరు?ఉద్యమ నాయకుడు కావడం వల్ల కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే, తెలంగాణ తలెత్తుకుని తిరిగేలా రూపు దాలుస్తుందని బుద్ధిజీవులు భావించి ఉంటారు.పదవులు తీసుకోవడం ద్వారా తెలంగాణ కోసం పనిచేసే అవకాశం లభిస్తుందని అనుకున్నారేమో !ఇప్పటికీ వారి తీరు మారలేదు.రేవంత్ రెడ్డి చర్యలను వ్యతిరేకించే నెపంతో బీఆర్ఎస్‌కు మేలు చేయడానికి సిద్ధపడ్డారు. తమను తాము సమర్థించుకుంటూ, ప్రశ్నలు వేస్తున్న వారిపై మాటల ఈటెలు విసురతూ, తాము తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం చేసిన త్యాగాలను ఏకరవు పెడుతున్నారు. రేవంత్ రెడ్డి పాలనను వ్యతిరేకిస్తున్న బుద్ధిజీవులు చాలా మంది గతంలో నక్సలైట్ రాజకీయాల్లో పనిచేసేవాళ్లే కావడం ఒక చారిత్రక విషాదం.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999

# ఇసుక ధరలకు రెక్కలు..

- ఒక్కో ట్రాక్టర్ లోడు కు రూ.6వేల నుంచి రూ.9వేలు
- దూరాన్ని బట్టి ధర నిర్ణయిస్తున్న వ్యాపారులు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అనేక అవరోధాలు
- ధరల నియంత్రణపై దృష్టిసారించని యంత్రాంగం
- ఆర్థిక భారంతో అవస్థలు పడుతున్న లబ్ధిదారులు



**ఆదిలాబాద్, మహా:** ఇసుక ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. మొన్నటి వరకు ఓ లెక్క..ఇప్పుడో లెక్క అనే రీతిలో మారింది. వర్షాకాలంతో ఇసుక లభించకపోవడం..మరో వైపు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కొనసాగడం కారణంగా ఇదే అదనుగా భావిస్తున్న ట్రాక్టర్ యజమానులు అమాంతం ధర పెంచేస్తున్నారు. ఫలితంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ధరల గండం పట్టుకుంది. ఇసుకతో పాటు మిగితా నిర్మాణ సామగ్రి ధరలు సైతం పెరగడంతో లబ్ధిదారులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోంది. ఫలితంగా ఇళ్ల నిర్మాణాల్లోనూ వేగం మందగించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోపక్క ధరల నియంత్రణకు జిల్లా, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా వాటి ఏర్పాటులో కాలయాపన జరుగుతోంది.

**ఇసుక బంగారమాయే..**

ఇంటి నిర్మాణంలో కీలక ముడి సరకుగా ఉండే ఇసుక ధరలు పెరుగుతుండటం లబ్ధిదారులను ఆందోళనకు గురిచేస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో తొలి విడత 2131 ఇళ్ళు మంజూరు కాగా..1450 వరకు ప్రారంభమయ్యాయి. ఇందులో 800వరకు బెస్మెంట్ లెవల్ వరకు పూర్తయ్యాయి. రెండో విడత లో 6955 ఇళ్ళు మంజూరు కాగా సుమారు వేల వరకు ప్రారంభమయ్యాయి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రారంభ దశలో ఒక్కో ట్రాక్టర్ లోడు ఇసుకకు రూ.3500 వరకు ఉండగా.. ప్రస్తుతం ఈ ధర ఏకంగా రూ.6వేల నుంచి రూ.9వేల వరకు పెరిగింది. ఆదిలాబాద్ పట్టణంలో రూ.6వేలకు ఒక్కో ట్రాక్టర్ ఇసుక విక్రయిస్తుండగా.. సమీపంలోని పల్లెలకు వెళ్లాలంటే దూరాన్ని బట్టి రూ.9వేల వరకు ధర నిర్ణయిస్తున్నారు. ఈ ధర చెల్లించలేని లబ్ధిదారులు ప్రస్తుతానికి ఇంటి నిర్మాణాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిసింది. దూరాన్ని బట్టి ధర నిర్ణయించడంతో లబ్ధిదారులకు ఆర్థిక భారంగా మారుతోంది. ఇసుకతో పాటు సిమెంట్, ఇనుము, ఇటుకల ధరలు కూడా మునుపటి కంటే పెరగడం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవరోధంగా మారుతోంది.

**అక్కడికి వెళ్తేనే ఉచితం..**

ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచిత ఇసుక సరఫరా చేస్తున్నామని చెబుతోంది. కానీ లబ్ధిదారులకు ఉచిత ఇసుక తీసుకోవడం కూడా కష్టంగా మారుతోంది. నదులు, వాగుల వద్దకు సొంతంగా ట్రాక్టర్ సమకూర్చుకొని వెళ్లి తీసుకురావాల్సి ఉంటుంది. కేవలం రాయల్టి మాత్రమే చెల్లించాల్సిన అవసరం ఉండదు. కానీ ఆయా నదులు, వాగుల వద్దకు వెళ్లి ఇసుక తీసుకొచ్చేందుకు ట్రాక్టర్, కూలీలకు కలిపితే రూ.5వేలకు పైగానే కావస్తుండటం..మరోపక్క కూలీలను సమకూర్చుకోవడం కష్టతరంగా మారే పరిస్థితి ఉండటంతో అనేక మంది లబ్ధిదారులు ఉచిత ఇసుక జోలికి వెళ్లడం లేదని తెలుస్తోంది. మండల స్థాయిలో ఇసుక తీసుకెళ్లేందుకు అనుమతులు ఇస్తున్నా వాటిని నదుల నుంచి తీసుకురావడం లబ్ధిదారులకు కష్టంగా మారుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరో పక్క ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ధరల నియంత్రణ కమిటీలు వేయాలని సూచించింది. ఈ కమిటీలు నిర్మాణ సామగ్రి ధరలు పెరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేసింది. కానీ ఇప్పటి వరకు కమిటీలు ఏర్పాటు చేసినట్లు కనిపించడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ సమస్యలపై దష్టిసారించి నిర్మాణ సామగ్రి ధరలను నియంత్రించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఫలితంగా ఇంటి నిర్మాణాలు సైతం వేగంగా సాగేందుకు ఆస్కారం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# సరిహద్దుల్లో మావోయిస్టు సంచలనం

- ఆపరేషన్ కగార్‌కు ప్రతిస్పందనగా మావోయిస్టుల సంస్మరణ పిలుపు
- గిరిజన గ్రామాలు నిశ్శబ్దం.. ఎర్రదళాల పిలుపు కలకలం
- జల్లెడపడుతున్న భద్రతా దళాలు



**భద్రాచలం, మహా.** మావోయిస్టు ఉద్యమం మళ్లీ తలెత్తే సూచనలు కనిపిస్తున్నాయి. తెలంగాణా-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఇటీవల కనిపించిన కరపత్రాలు, బేనర్లు - భద్రతా వర్గాలను ఆందోళనలోకి నెట్టాయి. ప్రజా ఉద్యమాల పేరుతో ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా మావోయిస్టులు ప్రకటించిన సంస్మరణ వారోత్సవాలు, గిరిజన గ్రామాల్లో వణుకు పుట్టించాయి. ఆదివాసీ ప్రాంతాల్లో ఆర్మీ కూంబింగ్ ముమ్మరమవుతుండగా, నక్సల్స్ మాత్రం తమ ఉనికిని చాటేందుకు పావులు కదుపుతున్నారు. ఈ పరిస్థితులు ఈ ప్రాంత భద్రతా భవిష్యత్తుపై తీవ్ర సందేహాలను రేకెత్తిస్తున్నాయి. ప్రజలు భయభ్రాంతుల్లో జీవనం కొనసాగిస్తుండగా, అధికార యంత్రాంగం అల్లర్లు లేదా విధ్వంసక చర్యలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. ఈ ఉద్రిక్తతల నడుమే మావోయిస్టుల తుపానుకు ప్రజలు మళ్లీ బలవుతారా? అని ఆందోళన వ్యక్తమవుతోంది.

**సరిహద్దులో మావోయిస్టు ఉనికి కలకలం.**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మావోయిస్టు ఉద్యమం మళ్లీ చాపకింద నీరులా కదులుతోంది. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామాల్లో పునఃప్రవేశం చేసిన మావోయిస్టులు, ప్రజల్లో మద్దతు సంపాదించేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. ఇటీవల చర్ల మండలంలోని ఆర్.కొత్తగూడెం గ్రామంలో గిరిజన పాఠశాల దరి వద్ద, బస్‌షెల్టర్ వద్ద కనిపించిన మావోయిస్టు బేనర్లు దీనికి నిదర్శనం. "ఆపరేషన్ కగార్‌కు ప్రజా ఉద్యమాలతో మేము ప్రతిఘటిస్తాం" అనే వాక్యాలు గల బోర్డులు, స్థానిక భద్రతా వ్యవస్థను అలెర్ట్ చేశాయి. మావోయిస్టులు జూలై 29 నుండి ఆగష్టు 3వ తేదీ వరకు తమ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించేందుకు పిలుపునివ్వడమే కాకుండా, చుట్టుపక్కల గిరిజన గ్రామాల్లో ప్రచారం చేపట్టే యత్నాలు చేస్తున్నారు.

**ఘనంగా వారోత్సవాలు జరపాలనే మావోయిస్టు లక్ష్యం**

ప్రతీ ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మావోయిస్టులు తమ అమరవీరుల కోసం ప్రత్యేక వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అయితే ఈసారి వారి వ్యూహాలు మరింత దూకుడుగా కనిపిస్తున్నాయి. సాయుధ దళాలు అడవుల్లో మోహరించడంతో, మావోయిస్టుల ఉనికి కనిపించకుండా కార్యకలాపాలు జరిపే ప్రయత్నాలు ప్రారంభించారు. ముఖ్యంగా నూతనంగా కలిసిన కేడర్‌కు ఉత్తేజం కలిగించడానికి ఈ సంస్మరణ వారాలు కీలకంగా భావిస్తున్నారు.

**ప్రజల్లో ఆందోళన .. గ్రామాలే మూసుకుపోయిన వైనం**

ఆర్టికొత్తగూడెం, గంగారాం, పిట్టగూడెం వంటి సరిహద్దు గ్రామాల్లో ప్రజలు ఇప్పటికే రాత్రిపూట గూళ్ల లోనే ఉండిపోతున్నారు. వాహనాల రాకపోకలపై పోలీసులు నిశితంగా నిఘా పెట్టారు. అనుమానితులను స్థానిక స్టేషన్లకు తరలించి విచారిస్తున్నారు. కొన్ని మార్గాల్లో ప్రయాణాలపై నిర్బంధాలు విధించారు.

**భద్రతా బలగాల కూంబింగ్ ముమ్మరం**

ఛత్తీస్‌గఢ్‌లో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌ను తెలంగాణకు విస్తరించిన భద్రతా బలగాలు, ములుగు, భద్రాచలం, ఏటూరునాగరం ప్రాంతాల్లో భారీ సంఖ్యలో కూంబింగ్‌ను ప్రారంభించాయి. సి అర్ పీ ఎఫ్ , గరుడ దళాలు, గ్రేహౌండ్స్ కలిసి ఈ ఆపరేషన్‌ను నడుపుతున్నాయి.

**మావోయిస్టుల వ్యూహాత్మక పునఃప్రవేశం**

ప్రజా ఉద్యమాల పిలుపుతో మావోయిస్టులు పాత వ్యూహాన్నే కొనసాగిస్తున్నారు. గ్రామస్తులకు 'సైనికుల మీద సమాచారం ఇవ్వొద్దు' అని హెచ్చరిస్తూ, ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో వ్యతిరేకత పెంచే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో జరిగిన ఘటనల పునరావృతానికి అవకాశాలు ఉన్నాయని, అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఈ పరిణామాలు భద్రాచలం అటవీ ప్రాంతంలో మళ్లీ మావోయిస్టు వలయాల పునరుద్ధరణకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి. ప్రజల్లో భయభ్రాంతులు, భద్రతా బలగాల్లో అప్రమత్తత, రెండు వైపులా విస్తరిస్తున్న ఉత్కంఠ.. తదుపరి కొన్ని రోజులు ఈ ప్రాంత భవిష్యత్తు కోసం కీలకమైనవిగా మారబోతున్నాయి. ఒక్క అడుగు తప్పినా, ఎర్రదళాల గెరిల్లా పోరాటానికి మళ్లీ మార్గం విప్పే ప్రమాదం ఉందన్న హెచ్చరికలతో, ప్రభుత్వం గట్టి భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరం కనిపిస్తోంది.



# త్వరలో గ్రంథాలయాన్ని కట్టిస్తాం...

**చైర్మన్ నరసయ్య**

**తలమడుగు మహా:** నూతన గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేస్తానని గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య అన్నారు. తలమడుగు మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని సోమవారం సందర్శించడం జరిగింది. గ్రామస్తులు మాట్లాడుతూ మండల కేంద్రంలో యూత్ కార్యాలయంలో గ్రంథాలయం ఉన్నప్పటికీ అది శిథిలావస్థకు చేరి ఆ చుట్టుపక్కలంతా అపరిశుభ్రంగా ఉన్నందున ఎవరు కూడా ఇక్కడికి వచ్చి చదువుకోవడం లేదని మా గ్రామానికి నూతన గ్రంథాలయం కోసం గతంలో రిజిస్ట్రేషన్ చేయించడం జరిగిందని ఆ స్థలంలోనే గ్రంథాలయం కట్టించాలని కోరారు. ఇక్కడ కట్టిస్తే మండల విద్యార్థులకు నిరుద్యోగులకు కూడా ఎంతగానో ఉపయోగపడుతుందని సూచించారు. చైర్మన్ మల్లెపూల నరసయ్య మాట్లాడుతూ త్వరలో మండల కేంద్రానికి నూతన గ్రంథాలయ భవనాన్ని కట్టిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. మొదటిసారి చైర్మన్ అయ్యాక మండల కేంద్రానికి రావడంతో మండల నాయకులు స్థానిక గ్రామస్తులు శాలువాతో చైర్మన్ ను సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు గోక గణేష్ రెడ్డి, బాబన్న, సొసైటీ వైస్ చైర్మన్ పద్మాకర్ రెడ్డి, నాయకులు రాజేశ్వర్, వెంకన్న యాదవ్, రవికాంత్ యాదవ్, సదాశివ్, ప్రవీణ్ రెడ్డి,అభిరామ్ రెడ్డి, రామ్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగతిన పరిష్కరించాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య**



**మంచిర్యాల, మహా :** జిల్లాలో ప్రజావాణికి దరఖాస్తులు చేసుకున్న వారి సమస్యలు త్వరగతిన పరిష్కరించాలని జిల్లా వివిధ అధికారులకు మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు తో కలిసి అర్జీదారుల దరఖాస్తులు స్వీకరించారు. జన్నారం, దండేపల్లి మండల వాసులు లక్షెట్టిపేట నుండి దండేపల్లి, జన్నారం మీదుగా నిర్మల్, ఆదిలాబాద్ రాష్ట్ర రహదారులపై పగటివేల భారీ వాహనాల రాకపోకలపై రాష్ట్ర అటవీ శాఖ విధించిన నిషేధాన్ని ఎత్తివేసేలా చర్యలు తీసుకొని మండలాల అభివృద్ధికి తోడ్పడాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కన్నెపల్లి గ్రామస్తులు కన్నెపల్లి, ముత్తాపూర్, అంకన్నపేట శివారుల లో గల సీలింగ్, అసైన్డ్, ఇనాం, లావుని, ప్రభుత్వ భూములను పొందిన వాటికంటే ఎక్కువగా భూమిని సాగు చేస్తున్న వారి భూములకు కొలతలు నిర్వహించి నిరుపేదలైన తమకు వ్యవసాయం చేసుకునేందుకు జీవనాధారం కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణం టేకుల బస్తీకి చెందిన తోట పోచన్న తనకు గల భూమిలో వేరొక వ్యక్తి ఇల్లు ఉన్నట్లుగా తప్పుడు సమాచారంతో ఇంటి నెంబరు పొంది పట్టా తీసుకున్నాడని ఫిర్యాదు అందజేశారు. చెన్నూరు మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన బొమ్మ శ్రీనివాస్ తన తండ్రి పేరిట కాంబోజి పేట శివారులో భూమి ఉంది, ఇట్టి భూమిని తమకు తెలియకుండా వేరొకరు అక్రమంగా పట్టా చేసుకున్నారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి తన పేరిట విరాసత్ పట్టా మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాసిపేట మండలం ధర్మరావుపేట గ్రామానికి చెందిన ముక్కిడి మల్లయ్య, ఏనుగు జనార్దన్ రెడ్డి రాళ్లవాగు ప్రాజెక్ట్ క్రింద కాలువ నిర్మాణం లో తమ భూమి పోయిందని, నష్ట పరిహారం ఇప్పించాలని కోరుతూ వేరువేరుగా దరఖాస్తులు అందజేశారు. బెల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన రాదండి లావణ్య తన పేరిట చెన్నూర్ శివారులో గల భూమిలో కొందరు అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేస్తున్నారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాసిపేట మండలం ధర్మరావుపేట గ్రామస్తులు తమ దరఖాస్తులో తమ గ్రామ ఊర చెరువుకు చేపల పెంపకానికి వేలం పాట నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 72 దరఖాస్తులు వచ్చాయని, ప్రతి దరఖాస్తును క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ధర్నా, మహాధర్నాలను విజయవంతం చేయండి

**ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటి (యు.ఎస్.పి.సి.) పిలుపు**



**మందమర్రి, మహా :** ఆగస్టు 1 కలెక్టర్ కార్యాలయం ముందర ధర్నా, ఆగస్టు 23 రాష్ట్ర రాజధాని లో నిర్వహించు మహాధర్నాలను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటి (యు.ఎస్.పి.సి.) నాయకులు పోడేటి సంజీవ్, భుక్య కిరణ్, కాశి ప్రకాష్, దేవ రమేష్, కె విజయలక్ష్మి లు సోమవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ పాఠశాలల, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై యు పి ఎస్ సి దశలవారీ పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. అందులో భాగంగా జులై 23, 24 న మండల తహసీల్దార్ల ద్వారా ముఖ్యమంత్రికి మెమోరండం ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఉమ్మడి రాష్ట్రంలో వివక్షకు గురైన విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని ఆశించామని తెలిపారు. కానీ కొత్త రాష్ట్రం ఏర్పడి 11 ఏళ్లు గడిచిన ఎక్కడి పరిస్థితులు అలాగే ఉన్నాయని వాపోయారు. అన్ని క్యాడర్ల బదిలీలు, పదోన్నతులు షెడ్యూల్ లను తక్షణమే విడుదల చేసి, జిహెచ్ఎం, ఎస్ ఏ, పిఎస్ హెచ్ఎం ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జి.ఓ. నం. 25 ను సవరించి, ప్రతిపాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులుండాలని కోరారు. 40 మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలో తరగతికొక టీచర్ ఉంచి, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా టీచర్ పోస్టులు కేటాయించాలని పేర్కొన్నారు. అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని వెల్లడించారు. రిటైర్ అయిన ఉపాధ్యాయుల పెన్షనరీ బెనిఫిట్స్ తక్షణమే విడుదల చేయాలని పేర్కొన్నారు. జూనియర్ లెక్చరర్ పదోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్లకు 40 శాతం వాటాను పునరుద్ధరించాలని కోరారు. సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె కాలపు జీతాన్ని వెంటనే చెల్లించాలని తదితర 30 డిమాండ్ల సాధనలో భాగంగా ఈ ఉద్యమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు.



# అర్జీలను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్శి షా**

**ఆదిలాబాద్, మహా:** ప్రజలు అందించే ఆర్జీలను త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. సోమవారం పట్టణంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. వారి సమస్యలను సావధానంగా ఆలకించి పరిష్కారానికి చేపట్టవలసిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారి చేశారు. ప్రజావాణి విభాగంలో 114 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. భూ సమస్యలు, పెన్షన్లు, విద్యుత్, విద్య, వైద్యం తదితర విభాగాలకు సంబంధించిన ఆర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెనీ కలెక్టర్ సలోని, ఆర్డీవో స్రవంతి, ఆయా శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**ఆదిలాబాద్, మహా:** మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కుంటున్న సమస్యలపై అధికారులకు ఎన్ని మార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోతోందని తెలంగాణ మధ్యాహ్న బోజన పథకం జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల చిన్నన్న అన్నారు. సోమవారం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ సందర్భంగా లింగాల చిన్నన్న అన్నారు. ప్రాథమికొన్నత పాఠశాలల్లో రూ. లక్షకు పైగా, ప్రైమరీలో రూ. డెబ్బై నుండి రూ. తొంభై వేల రూపాయల వరకు బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. పెండింగ్ బిల్లులను విడుదల చేయాలన్న డిమాండ్ తో ఆగస్టు 6న కమిషనర్ కార్యాలయం ముట్టడిస్తున్నామన్నారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో రేఖ, సునీత, సుమిత్ర, కిష్టమ్మ, భూమక్క, అశ్విని, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# అది జాబ్ మేళా కాదు.. బీఆర్ఎస్ మేళా

- ఇచ్చోడలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నిర్వహించిన జాబ్ మేళా పై విమర్శలు
- స్థానిక ఎన్నికల్లో లబ్ధి కోసమే వారి అబద్ధాలు
- యూరియా సరఫరా కేంద్రం బాధ్యత
- బీజేపీ నాయకులు సోయి లేకుండా మాట్లాడుతున్నారు.
- డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజరెడ్డి ధ్వజం




**ఆదిలాబాద్, మహా:** ప్రభుత్వం ఉద్యోగాలివ్వడంలేదన్నది ముమ్మాటికి అవాస్తవమని అబద్ధాలు మాట్లాడితే ప్రజలు అసహ్యించుకుంటారని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. సోమవారం కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన బీఆర్ఎస్ బీజేపీ లపై విమర్శలు గుప్పించారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. మీ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్లలో లక్షా 35వేల ప్రభుత్వ ఉద్యోగాలిస్తే కాంగ్రెస్ సర్కార్ కేవలం 18 నెలల్లో 60వేల కు పైగా ఉద్యోగాలిచ్చిందని గుర్తు చేసారు.ప్రైవేట్ లో కూడా ఇప్పటివరకు దాదాపు 2లక్షల 75 వేల ఉద్యోగాలిచ్చిందన్నారు.కేవలం రానున్న స్థానిక ఎన్నికల్లో రాజకీయ లబ్ది పొందేందుకు అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజలెవరూ మీ మాటలు నమ్మేస్థితిలో లేరన్నారు. ఎందుకంటే మీవెంట ఉంది నాయకులు కాని ప్రజలు కాదన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యేగా 15ఏళ్లు పాలించిన జోగురామన్న స్వంత ఊర్లో ఒక్కరికైనా ఇల్లు కట్టించిండా అని ప్రశ్నించారు. కుటుంబ రాజకీయాలకే ప్రాధాన్యమిచ్చారు తప్పితే ప్రజల గురించి పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వం రికార్డు స్థాయిలో 21వేల కోట్ల రుణ మాఫీ, తొమ్మిది రోజుల్లో 9వేల కోట్ల రైతుభరోసా కొత్త రేషన్ కార్డులు ఇచ్చిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ , రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు లాంటి ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజా పాలన కొనసాగిస్తుందన్నారు. మంచిగా పని చేస్తున్న ప్రభుత్వంపై అనవసర అబద్ధాలతో బురద చల్లాలని చూస్తే వచ్చే ఎన్నికల్లో మీకు పుట్టగతులుండవన్నారు. ఇక బీజేపీ ప్రజాప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వ పథకాలను తమవిగా ప్రచారం చేసుకోవడానికి సిగ్గుండాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లలో కేంద్రానికి ఎంత మాత్రం సంబంధం లేదన్నారు. అటు యూరియా విషయంలోనూ బీజేపీ నేతలు ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదని అన్నారు. గ్రామాల్లో యూరియా కొరత ఉంటే బీజేపీ ఎంపీ ఎమ్మెల్యేను ఎందుకు సరఫరా చేయడం లేదని నిలదీయండని సూచించారు. స్థానిక ఎన్నికల్లో ఓట్ల కోసం బీఆర్ఎస్ బీజేపీ లు చెప్పే చిల్లర మాటలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసారు. అలాంటి పార్టీలకు స్థానిక ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. నాయకులు గిమ్మసంతోష్ దేవిదాస్ చారి , సుధాకర్ గౌడ్, ఇర్ఫాన్ , పోతారెడ్డి, ఎంఏ షకీల్,రాజేశ్వర్ , అశోక్ ,రాంరెడ్డి,అజ్బత్. లతా, శ్రీలేఖ, సోనియా మంథని పాల్గొన్నారు.



# బాధితుల సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపించాలి

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్, మహా:** బాధితుల సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు క్యాంపు కార్యాలయం లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు సరైన సమయంలో న్యాయం జరిగినప్పుడు పోలీసుల పట్ల గౌరవం నమ్మకం మరింత పెరుగుతుందని తెలిపారు. సక్రమమైన విచారణ చేపట్టి బాధితులకు సరైన న్యాయం చేకూర్చాలని పేర్కొన్నారు. ఫిర్యాదుదారులలో ఎక్కువగా భూ సమస్యలతో బాధపడుతున్న వారు, ఫోర్జరీ పత్రాలు, భూములను ఆక్రమించుకోవడం నకిలీ పత్రాలను సృష్టించడం లాంటి వారితో పాటు కుటుంబ సమస్యలు, కుటుంబ కలహాలు, కోర్టు కేసులు కేసుల పరిష్కారాలపై నివేదికలను ప్రత్యేకంగా జిల్లా ఎస్పీకి విన్నవించారు. ఈ కార్యక్రమంలో సీసీ కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది వామన్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

- అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు
- చేవెళ్లలో లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ
- అబద్దాలు నమ్మి అపోహలకు పోవద్దు
- ప్రజలకు సూచించిన ఎమ్మెల్సీ ఎమ్మెల్యే



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రజల సంక్షేమం కోసం ఏర్పాటు చేసుకున్న ప్రజా ప్రభుత్వంలో రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతనం కొనసాగుతుందని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అన్నారు. సోమవారం చేవెళ్ల కేంద్రంలో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన, రాష్ట్ర చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య, ప్రజా పాలనలో భాగంగా, శంకర్ పల్లిలోని మణి గార్డెన్స్ లో మండలానికి చెందిన లబ్దిదారులకు మంజూరైన నూతన రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలు, రాష్ట్రంలోని పేద ప్రజలకు అందించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి పలు పార్టీల నాయకులు చెప్పే అబద్ధాలను నమ్మి అపోహలకు పోవద్దని వారు అన్నారు. గత పది సంవత్సరాలు అధికారంలో ఉండి ప్రజలకు చేసింది ఏమీ లేదని, రాష్ట్రాన్ని అప్పులకు కుప్పగా మార్చి ప్రజలపై అప్పుల భారం మోపి, ఈరోజు ప్రగల్బాల్ పలుకుతున్నారని వారు మండిపడ్డారు. ప్రజా పాలనలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని, ప్రజల సంక్షేమం కోసం ఏర్పాటు చేసుకున్న ప్రజా ప్రభుత్వంలో ప్రజలే పాలకులుగా కొనసాగుతున్నారని వారు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా శంకర్ పల్లి పట్టణం మరియు మండలానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన రూ 10,71,000 విలువ గల 26 చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పార్టీ బలోపేతమే ఆర్జీపీఆర్ ఎస్ లక్ష్యం

**స్టేట్ ఇంచార్జ్ సుభాష్ యాకరణ్**

**ఆదిలాబాద్, మహా :** గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ లక్ష్యమని ఆర్ జీపీఆర్ఎస్ జాతీయ కార్యదర్శి ,తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇంచార్జి సుభాష్ యాకరన్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా పర్యటన లో భాగంగా పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. స్థానిక కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు పూల బొకేలతో ఘన స్వాగతం పలికారు. ఆర్జీపీఆర్ ఎస్ ద్వారా గ్రామస్థాయిలో ప్రజల్లోకి వెళ్తూ, వారి సమస్యల్ని తెలుసుకొని అవి తీర్చడం ప్రజల్లో పార్టీ పట్ల నమ్మకం కలుగుతుందని ఆయన అన్నారు. దీంతో గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం అవుతుందని తెలిపారు.ఇది పార్టీలో పని చేయాలనుకునేవారికి ఒక్క గొప్ప అవకాశమని ఆసక్తి ఉన్నవారు మండల కన్వీనర్లుగా, గ్రామ కన్వీనర్లుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. దీని ద్వారా భవిష్యత్ లో పార్టీలో గాని ప్రజల్లో వారికి మంచి పేరు వస్తుందని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్జీపీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు ఆడె గజేందర్ ,నాయకులు గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్ రెడ్డి , మునిగెల విఠల్ ,కలాల శ్రీనివాస్, రామ్ కుమార్ , చంద్ర షావ్,దేవిదాస్ చారి, డేరా కృష్ణారెడ్డి , అఖిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అవస్థలపల్లిగా... అయ్యవారిపల్లి

## వాగు పారితే గ్రామానికి అవస్థలే...

అర్థాంతరంగా నిలిచిన వంతెన పనులు...

వారం రోజులుగా స్తంభించిన రాకపోకలు...

పట్టించుకోవాల్సిన అధికారులు పట్టించుకోరు...

ప్రజాప్రతినిధులు అటు వైపు చూడరు...



**షాద్ నగర్, మహా:** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలంలోని అయ్యవారిపల్లి గ్రామం వర్షాకాలంలో ఎదుర్కొంటున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. అయ్యవారిపల్లి అవస్థల పల్లిగా మారుతుంది.. ఏటా వర్షాలు మొదలవగానే ఈ గ్రామానికి బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. ప్రస్తుతం వాగు ప్రవహించడంతో గత వారం రోజులుగా అయ్యవారి పల్లికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీనికి తోడు, గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన వంతెన పనులు నేటికీ అసంపూర్తిగా ఉండటంతో గ్రామ ప్రజల కష్టాలు రెట్టింపు అయ్యాయి.

**వాగు ప్రవాహంతో స్థంభించిన జనజీవనం**

వాగు ప్రవహిస్తుండటంతో గ్రామంలోకి, గ్రామం నుంచి బయటకు వెళ్లే దారులు పూర్తిగా మూసుకుపోయాయి. పిల్లల చదువులు, శుభకార్యాలు, ఇతర పనులన్నీ నిలిచిపోయాయి. అత్యవసర వైద్య సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూలీ పనులకు వెళ్లేవారు, చిన్న వ్యాపారాలు చేసుకునేవారు పనులు లేక ఆర్థికంగా నష్టపోతున్నారు. తాత్కాలికంగా ఉన్న రహదారి కూడా పూర్తిగా కొట్టుకుపోవడంతో, వాగు ఉధృతి తగ్గినప్పటికీ ప్రయాణం అసాధ్యంగా మారింది. అదేవిధంగా ఇదే గ్రామం మీదుగా ఉప్పరిగడ్డ, ఆగిర్యాల తదితర గ్రామాలకు ప్రధాన రహదారి ఇదే కావడంతో నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారి గుండానే వెళ్తాయి. ప్రస్తుతం ఈ గ్రామాల ప్రజల సైతం ఇతర మార్గాల్లో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

**అసంపూర్తిగా వంతెన పనులు**

అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నా, అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో వాగుపై వంతెన నిర్మాణం చేపట్టినా, పనులు అసంపూర్తిగానే నిలిచిపోయాయి. వంతెన పనులు ఎందుకు ఆగిపోయాయో, వాటిని పూర్తి చేయడానికి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో తమకు అర్థం కావడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం తాత్కాలికంగానైనా ప్రత్యామ్నాయ రహదారిని ఏర్పాటు చేయడంలోనూ అధికారులు విఫలమయ్యారని వారు మండిపడుతున్నారు.

**తక్షణమే స్పందించాలి**

అయ్యవారిపల్లి ప్రజలు ప్రస్తుతం అనుభవిస్తున్న కష్టాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే దృష్టి సారించాలని వారు కోరుతున్నారు. వంతెన పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని, ప్రస్తుతానికి తాత్కాలికంగానైనా సురక్షితమైన ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. అయ్యవారిపల్లి గ్రామ ప్రజల దీన పరిస్థితిని ఉన్నతాధికారులు గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆశిద్దాం.

# విద్యార్థుల చావులన్నీ ప్రభుత్వ హత్యలే..

**ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్**

**విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు**



**షాద్ నగర్, మహా:** ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కుంటబడి స్కూల్ ని సందర్శించారు. అక్కడ విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు. ఈ మధ్యకాలంలో వరుస ఫుడ్ పాయిజన్లు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. అలాగే ఫుడ్ పాయిజన్ ద్వారా చనిపోతున్న విద్యార్థులందరికీ ప్రభుత్వం న్యాయం చేయాలని వారు కోరారు. తెలంగాణలో ఇటీవలి ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు ప్రజలలో ఆందోళన కలిగించాయి. ప్రభుత్వం యొక్క నిర్లక్ష్యం మరియు ఆహార భద్రతా ప్రమాణాలను సరిగా అమలు చేయకపోవడం ఈ సమస్యకు ప్రధాన కారణాలు ఫుడ్ పాయిజనింగ్ సమస్యలపై ప్రభుత్వ వైఫల్యాలను విశ్లేషిస్తూ, వాటిని నివారించడానికి అవసరమైన చర్యలను తీసుకోవాలి. తెలంగాణలో, గురుకుల పాఠశాలల్లో ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు తరచూ నమోదవుతున్నాయి. నిర్మల్ జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 10 మంది విద్యార్థినులు కలుషిత ఆహారం కారణంగా అస్వస్థతకు గురయ్యారు. అసమర్థంగా వండిన ఆహారం, సరైన అవగాహన లేని సిబ్బంది ఈ ఘటనలకు కారణమని తెలుస్తోంది. అదేవిధంగా, నాగర్‌కర్నూల్ లో జరిగిన ఒక ఘటనలో, విద్యార్థులు తీవ్ర అస్వస్థతతో ఆసుపత్రిలో చేరారు, కానీ ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేకపోవడం సిగ్గుచేటు... విద్యార్థులు వరుస పాయిజన్లతో చనిపోతా ఉంటే ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదో వివరణ ఇవ్వాలి అలాగే విద్యాశాఖకు ఒక మంత్రిని కేటాయించి గురుకులాలలో పర్యటించి విద్యార్థుల సమస్యలు తెలుసుకోవాలి అక్కడున్నటువంటి సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలి అని ఎస్ఎఫ్ఐ గా డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ టౌన్ ఉపాధ్యక్షులు ఆదిల్ మరియు ఎస్ఎఫ్ఐ నాయకులు ఖయ్యూం, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు..

# అర్హులైన పేదవారికి ఆహార భద్రత

**రేషన్ కార్డు.. పేదవాడి ఆత్మగౌరవం**

- ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అహర్నిశలు కృషి
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఆమనగల్లు,మహా:** ప్రతి పేద కుటుంబం గుర్తింపు ,ఆకలి తీర్చే ఆయుధం రేషన్ కార్డు అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు.సోమవారం పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో మండలంలో పేదలకు మంజూరైన నూతన రేషన్ కార్డుల పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పదేళ్లుగా ప్రజలు రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న అర్హులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల లోనే ఇచ్చినట్లు తెలిపారు.సంక్షేమ పథకాలకు రేషన్ కార్డులు చాలా ప్రధానమన్నారు.ఇళ్లు,పింఛన్లు, ఆరోగ్యశ్రీ,వ్యక్తిగత బీమా సౌకర్యం,ఇతర అవసరాలకు కూడా రేషన్ కార్డు ప్రధానమని తెలిపారు.ప్రజా సంక్షేమం,రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వలేదని..కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డ్ మంజూరు చేయడంతో పాటు ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు.బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు వంటి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.ఇప్పటికే ప్రభుత్వం ఉచిత విద్యుత్,ఉచిత బస్సు సౌకర్యం,సబ్సిడీ గ్యాస్,సన్నబియ్యం,రాజీవ్ ఆరోగ్యశ్రీ,సన్నధాన్యానికి బోనస్ వంటి ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు.కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డ్ మెంబర్ ఠాకూర్ బాలాజీ సింగ్, పీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్,మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా,వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం ,మాజీ జడ్పీటీసీ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా,మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్,పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య,సీనియర్ నాయకులు ఖలీల్,రమణ రెడ్డి గుర్రం కేశవులు,కాలే మల్లయ్య,జిల్లా నాయకులు అబ్దుల్ ఖాదర్, నిట్ట నారాయణ,కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,అబ్దుల్ అలీమ్,ఖాదర్ ఖాద్రి,వెంకట్ రెడ్డి,ఐఎన్టీయూసీ ఎంగలి ప్రసాద్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్,నాజర్,దేవరశెట్టి మహేష్,కండె సాయి,విజయ్ రాథోడ్,బాబా,శేఖర్ గౌడ్,రవి,కుమార్ గౌడ్,కొప్పు విజేందర్,నర్సింహా,శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విలువల వైతాళికుడు జైపాల్ రెడ్డి

- తెలంగాణ ఉద్యమంలో జైపాల్ రెడ్డి పాత్ర కీలకం
- పీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్



**ఆమనగల్లు,మహా:** విలువల వైతాళికుడు ఉత్తమ పార్లమెంటేరియన్ దివంగత మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి వర్ధంతి వేడుకలను సోమవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో మాజీ జడ్పీటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.పీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్,మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా పాల్గొని జైపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..పార్లమెంటులో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంలో జైపాల్ రెడ్డి పాత్ర కీలకమని పట్టుదలకు మారుపేరుగా ఉన్న జైపాల్ రెడ్డి అంగవైకల్యం ఉన్నా 72 కాలేజీలకు అధ్యక్షుడిగా పనిచేశారంటే అతని స్ఫూర్తిని ఇప్పటి వారు కొనసాగించాలన్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే హైదరాబాద్ మెట్రో రైలుకు ప్రతిపాదనలు తయారు చేశారని గుర్తుచేశారు.బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా,మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్,పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య,సీనియర్ నాయకులు ఖలీల్,కాలే మల్లయ్య,జిల్లా నాయకులు కృష్ణ నాయక్,అబ్దుల్ ఖాదర్,కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గాజుల సురేష్,అబ్దుల్ అలీమ్,దశరథం, పులికంటి మైసయ్య,ఖాదర్ ఖాద్రి,ఐఎన్టీయూసీ ఎంగలి ప్రసాద్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్,ఎన్ఎస్ఈయూఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్,నాజర్, దేవర శెట్టి,కండె సాయి శేఖర్ గౌడ్,రవి కుమార్,కొప్పు విజేందర్, నర్సింహా,శ్రీను నాయక్,కిషన్ నాయక్,రాందాస్ నాయక్,వెంకటేష్ పాల్గొన్నారు.



# ఫిర్యాదుకు స్పందించిన కార్పొరేటర్

**రోడ్డు పనులను ప్రారంభం**

**హర్షం వ్యక్తం చేసిన కాలనీవాసులు**

**రాజేంద్రనగర్ మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధి బాబుల్ రెడ్డి నగర్ కాలనీలో రోడ్డు లేక భూగర్భ డ్రైనేజ్ పొంగి పొర్లుతుండడంతో స్థానిక ప్రజలు కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి వాటర్ బోర్డు అధికారులతో మాట్లాడి అక్కడ సమస్యను స్థానిక నాయకులతో చర్చించు సమస్యను పూర్తిగా పరిష్కరించారు. కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు రోడ్డు పనులను అధికారులు సోమవారం ప్రారంభించారు. కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి వెంటనే స్పందించి స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా వెంటనే రోడ్డు పనులను ప్రారంభించారు. కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డికి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రమేష్ రెడ్డి, వెంకట రమణ గుప్తా, మధుసూదన్ రెడ్డి, బస్తి వాసులు హర్షం వ్యక్తం చేశారు.


# వన మహోత్సవంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

**సమిష్టి సహకారంతో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం**

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** వన మహోత్సవంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటి భాగస్వాములు కావాలని చేవెళ్ల ఎమ్మెల్యే అన్నారు. షాబాద్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో రూ 3 కోట్ల 50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించబోయే అదనపు తరగతి గదులు, ల్యాబ్ భవనాలకు, చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య శంకుస్థాపనలు చేసి మొక్కలు నాటారు. అనంతరం షాబాద్ మండల కేంద్రంలోని పిహెచ్సి సెంటర్ ను సందర్శించారు. వన మహోత్సవంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి షాబాద్ మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "వనమహోత్సవ" కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వైద్యులు అందుబాటులో ఉండడం లేదని మరియు సమయపాలన పాటించడం లేదని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్లు ఎప్పుడు PHC సెంటర్ లో ప్రజలకు అందుబాటులో ఉండి, సేవలు అందించాలని, సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆదివారం మూసిలో గల్లంతైన బీటెక్ విద్యార్థి మృతదేహం లభ్యం

**రాజేంద్రనగర్, మహా :** జీడిమెట్ల నుంచి అక్షిత్ రెడ్డి గూగుల్ మ్యాప్ లో సర్చ్ చేసి సరదాగా స్నేహితులు పవన్, రోహిత్, అనిల్ తో కలిసి ఆదివారం ఈత కొట్టేందుకు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉప్పర్ పల్లి మూసి వాటర్ ఫాల్స్ లో వెళ్లారు. అక్షిత్ రెడ్డి (20) వాటర్ ఫాల్స్ లో కాలుజారి కింద పడిపోయి గల్లంతయ్యాడు. స్నేహితులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు అక్షిత్ రెడ్డి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి ఆదివారం గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహం లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీటిపర్వంతమయ్యారు. సోమవారం రాజేంద్రనగర్ సిఐ క్రాస్టో రెస్క్యూటీమ్, గజ ఈతగల సాయంతో మృతదేవాన్ని వెలికి తీసి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మూసి వాటర్ పార్క్ లోకి వెళ్లకుండా హైడ్రా, ఇరిగేషన్, రెవెన్యూ, అధికారులు అడ్డుగా ఫినిషింగ్ వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రకృతి సహజ సంపదను దోచుకుంటున్న మట్టి మాఫియా

**అంతా మా ఇష్టం అంటూ చెలరేగిపోతున్న వైనం**

**సిలింగ్ భూములలో గుట్టలను చదును చేస్తూ మట్టిని అమ్మేస్తున్న మట్టి మాఫియా**



**రాజేంద్రనగర్, మహా :** అంతా మా ఇష్టం అడ్డు ఎవరు రా చెప్పేది మాకు అన్నట్టుగా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులమని చేలామణి అవుతూ కోత్వాల్ గూడ ప్రభుత్వ సొమ్మును దిగమింగుతున్నారు. పచ్చని భారీ చెట్లతో అడవిని తలపిస్తున్న ప్రకృతి సహజ సంపద వనరులను దోచుకొని అమ్ముకుంటున్నారు. కోత్వాల్ గూడ రెవెన్యూ పరిధిలో వందల ఎకరాలు సీలింగ్ భూముల్లో ఇష్టానుసారం గుట్టలను చదును చేస్తూ మట్టిని అమ్ముకుంటున్నారు. కోత్వాల్ గూడ రోడ్డును అడ్డుపెట్టుకొని సీలింగ్ భూములలో గుట్టలను సైతం చదును చేసి మట్టిని అమ్ముకుంటున్నా మట్టి మాఫియా తతంగం. వందల ఎకరాల సీలింగ్ భూములో కోకొల్లలుగా రెడీమిక్స్ ప్లాంట్ లను ఏర్పాటు చేశారు. సీలింగ్ భూముల్లో ఎత్తయిన గుట్టలు ఉండేవి. రోడ్డు పేరుతో సీలింగ్ భూములలోని గుట్టలను జెసిబి ల సహాయంతో చదును చేస్తు పదుల సంఖ్యలో భారీ టిప్పర్లతో మట్టిని నగరానికి తరలిస్తున్నారు. గత పది రోజుల కిందనే కోత్వాలు గూడ రోడ్డు పనులు పూర్తయ్యాయని స్థానికులు తెలిపారు. అయినా అడిగేది ఎవడ్రా మా ఇష్టం అంటూ రోడ్డును అడ్డు పెట్టుకొని ఇష్టానుసారంగా మట్టిని తవ్వుతూ భారీ టిప్పర్లతో నగరానికి మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తతంగాన్ని గమనించిన స్థానికులు రోడ్డు పేరు చెబుతూ ఇష్టానుసారంగా వందల సంఖ్యలో మట్టి టిప్పర్లను నగరానికి తరలిస్తున్నారని చరవాణి సహాయంతో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న రెవెన్యూ అధికారులు సీలింగ్ భూములలో మట్టిని తరలిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని ఎమ్మార్వో రవీందర్ దత్ హెచ్చరించారు. జెసిబిలను టిప్పర్లను సిజ్ చేస్తామన్నారు. సీలింగ్ భూములలో ఎలాంటి నిర్మాణాలు సహజ వనరులను ధ్వంసం చేసి కార్యక్రమం ఏది చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



# రైతులెవరూ ఆందోళన చెందొద్దు

**యూరియా అందుబాటులో ఉంది**

**ఆమనగల్లు, మహా:** వ్యవసాయ అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని ,రైతులెవరూ ఆందోళనచెందొద్దని ఆమనగల్లు, మాడ్గుల వ్యవసాయ అధికారులు శ్రీనివాస్ గౌడ్, అరుణకుమారిఅన్నారు.సోమవారం గోదాంలో నిల్వ ఉన్న యూరియా బస్తాలను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఈ సీజన్ కు సరిపడా యూరియా సకాలంలో అందిస్తున్నట్లు చెప్పారు. యూరియా కావలసిన రైతులు తమ ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలని తెలిపారు. రైతులు ఆందోళన చెందకుండా అందుబాటులో ఉన్న యూరియాని తీసుకువెళ్లాలని సూచించారు. యూరియా విషయంలో ఎలాంటి వదంతులు నమ్మొద్దని, రైతుల అవసరం మేరకు యూరియా అందుబాటులో ఉందని మరో మారు స్పష్టం చేశారు.



# రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటాలి

**ఆదిలాబాద్, మహా:** రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి సూచించారు. పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో సోమవారం జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను కార్యక్రమ అతిథులు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులకు ఆయన దిశా నిర్దేశం చేశారు.నిరంతర సాధనతో నైపుణ్యాలు మెరుగుపరుచుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. రాష్ట్ర స్థాయిలోనూ సత్తా చాటి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని పేర్కొన్నారు. ఇందులో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఆగస్టు లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని వెల్లడించారు. గతేడాది రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించిందని, ఈ ఏడు సైతం అవే ఫలితాలు పునరావృతం కావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజేష్, జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, డీవైఎస్ఓ శ్రీనివాస్, పిఆర్టీయూ జిల్లా అధ్యక్షులు కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

**ట్రాఫిక్ సీఐ ప్రమోద్ కుమార్**

**రాజేంద్రనగర్, మహా ;** ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు జరిమాణాలు తప్పని ట్రాఫిక్ సిఐ ప్రమోద్ కుమార్ హెచ్చరించారు. ఆర్జీ ఐ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ జులై 28 2025 ట్రాఫిక్ నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఆర్జిఐ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 33 కేసులు పరిష్కరించబడ్డాయి.82, 000రూపాయలు జరిమానాలు విధించాము. మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి మూడు రోజుల సాధారణ కారాగార శిక్ష, 2000 రూపాయలు జరిమానా . 17 మందికి డ్రంక్ అండ్ డ్రైవ్ లో 50వేల రూపాయలు జరిమానాలు. 16కేసులు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేశారు. 16 మందికి 32 వేల రూపాయల జరిమానాలు విధించారు. ఆర్జీఐ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ రహదారి భద్రతను నిర్ధారించడానికి ట్రాఫిక్ నియమాలు కఠిన తరం చేయబడ్డాయి. పౌరులందరూ జరిమానాలు నివారించడానికి వారి భద్రతను నిర్ధారించడానికి ట్రాఫిక్ నియమాలను పాటించాలని ఆర్జీఐ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ ప్రమోద్ కుమార్ తెలిపారు.

# ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించడమే నా కర్తవ్యం

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ సర్కిల్ 11 పరిధి అత్తాపూర్ డివిజన్‌లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సోమవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలుచేశారు. మొత్తం రూ. 1.40 కోట్ల వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నారు. తేజస్వినగర్, లక్ష్మీ నగర్, రెడ్డి బస్తీ, సిక్ చావని ప్రాంతాలలో రూ. 91 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, ఓపెన్ జిమ్ , ప్యాచ్ వర్క్ పనులు అత్తాపూర్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో రూ. 49 లక్షల వ్యయంతో యూజీడీ (అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ) పనులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజల దీర్ఘకాల డిమాండ్లను నెరవేరుస్తూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ పనులన్నీ పూర్తయితే స్థానికులకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని అన్నారు. వర్షాకాలం దృష్ట్యా యూజీడీ పనులు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయని, వీటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ అభివృద్ధి పనులతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక కార్పొరేటర్లు, నాయకులు,పలు కాలనీల నివాసులు తదితరు పాల్గొన్నారు.

# పెన్షనర్లు.. ట్యాక్స్ ప్లానింగ్

అరవైఏళ్లు, 80 ఏళ్లు దాటిన వారు.. ఇలా వయసు పైబడిన వారికి, అంటే సీనియర్ సిటిజన్లకు బేసిక్ లిమిట్ మారుతుంది. ఇదంతా పాత పద్ధతిలో. కొత్త పద్ధతిలో సీనియారిటీతో సంబంధం లేకుండా అందరికీ ఒకే బేసిక్ లిమిట్. ఈ బేసిక్ లిమిట్‌లు, శ్లాబులు, రేట్లూ మీకు తెలిసినవే. పెన్షన్‌ని 'జీతాల' పరిధిలో పరిగణిస్తారు. పెన్షన్ కూడా ట్యాక్సబుల్ ఆదాయమే. రూ.10,000 పన్ను భారం దాటిన వారు అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లించాలి. సీనియర్ సిటిజన్లకు వ్యాపారం, వృత్తి మీద ఆదాయం లేకపోతే అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లించాల్సినవసరం లేదు.

ఆదాయపు పన్ను చట్ట ప్రకారం, జీతాన్ని ఎలా ట్యాక్సబుల్‌గా భావిస్తారో, అలాగే పెన్షన్లను కూడా భావిస్తారు. చాలా మంది పెన్షన్ మీద మినహాయింపు ఉందనుకుంటారు. కానీ, అది నిజం కాదు. పెన్షన్ ట్యాక్సబుల్ ఆదాయమే. బేసిక్ లిమిట్ లోపు ఉంటే తప్ప.. పన్ను భారం తప్పించుకోవడం ఉండదు. గవర్నమెంటులో రిటైర్ అయిన వారికి కమ్యూటెడ్ పెన్షన్ మినహాయింపు ఉంది. ముందుగా లెక్కలు కట్టి, ట్యాక్స్ ప్లానింగ్ ద్వారా కమ్యుటెడ్ పెన్షన్ మార్చుకోవచ్చు. పరమ్‌వీర్ చక్ర, మహా వీర్ చక్ర, వీర్ చక్ర మొదలైన వాటికి సంబంధించిన పెన్షన్లకు మినహాయింపు ఉంది. విదేశాల్లో సెటిల్ అయిన పెన్షనర్లకు వచ్చే పెన్షన్లను మన దేశంలోని ఆదాయంగా పరిగణిస్తారు. పెన్షన్లలో ఎరియర్స్ అంటే .. బకాయిలు వస్తే, వాటిని పన్ను పరిధిలోకి చేర్చి 89(1) సెక్షన్ కింద రిలీఫ్ పొందవచ్చు. ఈ పెన్షన్‌లో స్టాండర్డ్ డిడక్షన్ మినహాయింపు ఉంది. ఇక ఫ్యామిలీ పెన్షన్ విషయానికొద్దాం. ఒక వ్యక్తి చనిపోయిన తర్వాత, తన పెన్షన్‌ని కుటుంబంలోని వ్యక్తికి ఇవ్వొచ్చు. ఇలాంటి చెల్లింపులను ఫ్యామిలీ పెన్షన్ అంటారు. ఇక్కడ పెన్షన్ అని పేరుంది కానీ, ఇలాంటి పెన్షన్‌ను 'జీతం'గా భావించరు. ఇతర ఆదాయంగా భావిస్తారు. టీడీఎస్ అంశాలు వర్తించవు. పాత పద్ధతి అయితే రూ.15,000 మినహాయింపు ఇస్తారు. కొత్త పద్ధతి అయితే, రూ.25,000 మినహాయింపు వస్తుంది. సైన్యంలోని ఫ్యామిలీ సభ్యులకు మినహాయింపు పూర్తిగా ఇస్తారు. ఈ విషయానికి సంబంధించి చాలా పరిస్థితులనే పొందుపర్చారు. కానీ విధి నిర్వహణలో ఉండగా, సైన్యంలో చనిపోతే వారి కుటుంబానికి వచ్చే పెన్షన్ మీద మినహాయింపు ఉంటుంది.



## పెన్షన్, ఫ్యామిలీ పెన్షన్‌కి సంబంధించి ట్యాక్స్ ప్లానింగ్ విషయాలు..

పాత పద్ధతిలో వెళ్తే మంచిదా. కొత్త పద్ధతిలో వెళ్తే మంచిదా అనేది ఆలోచించుకోవాలి. వైద్యానికి సంబంధించిన మినహాయింపులను గత వారం తెలుసుకున్నాం. ఇవి పాత పద్ధతిలో ఉంటాయి. పెన్షనరీ బెనిఫిట్స్ భారీగా వస్తాయి. వాటిని సక్రమంగా, సరిగ్గా, సమగ్రంగా ఆలోచించి ఇన్వెస్ట్ చేయొచ్చు. 80సీ డిడక్షన్లు అనవసరం అనుకునే వాళ్లు చాలా మంది ఉన్నారు. వార్ధక్యంలో సేవింగ్ మీద పెద్ద మొత్తాల్ని 'బ్లాక్' చేసుకోవడం ఎందుకు. చేతిలో లేదా అందుబాటులో బ్యాంకు బ్యాలెన్సులు ఉంటే మంచిది. ఉదాహరణకు వైద్యంలాంటి ఏ అవసరానికైనా ఉపయోగపడుతుందనేది ఆలోచన. సీనియర్ సిటిజన్లకు ఎన్నో స్కీములు ఉన్నాయి. సరైన నిర్ణయం తీసుకోండి. ఆకర్షణీయమైన ప్రైవేట్ వ్యక్తుల చేతిల మోసపోకండి. అయితే, ఎన్నో మంచి ఇన్వెస్ట్‌మెంట్లు, స్కీములు ఉన్నాయి. కేవలం పాత పద్ధతిలోనే వాటిపై వడ్డీకి మినహాయింపులు ఉన్నాయి. ఎన్నారై సిటిజన్లు 15హెచ్ ఇవ్వకూడదు. కానీ రెసిడెంట్లు ఇవ్వొచ్చు. బ్యాంకు ఫిక్సిడ్ డిపాజిట్ల మీద వడ్డీ రూ. లక్ష దాటితే, టీడీఎస్ వర్తిస్తుంది. ట్యాక్సబుల్ ఇన్‌కం లోపల ఆదాయం ఉంటే, 15హెచ్ ఇస్తే పన్ను రికవరీ చేయరు. బేసిక్ లిమిట్ దాటితే 15హెచ్ ఇవ్వకూడదు. గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పీఎఫ్, సూపర్ యాన్యుయేషన్ ఫండ్ .. వీటన్నింటికీ పూర్తి మినహాయింపు ఉంది. కానీ, అవి ఇన్వెస్ట్ చేస్తే వచ్చే వడ్డీ/ఆదాయంపై మినహాయింపు కొత్త విధానంలో లేదు. 75 సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజన్లకు పెన్షన్ ఉండి, ఒకే ఒక బ్యాంకు అకౌంటులో నుంచి వడ్డీ .. ఈ రెండింటి మీదా పన్ను రికవరీ అయితే, రిటర్న్ వేయనక్కర్లేదు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పిల్లల చదువు కోసమా, స్వంత వైద్యానికా, ఇల్లు కొనుక్కోవడమా, బంగారం కొనడమా, షేర్స్‌లో ఇన్వెస్ట్ చేయడమా, పిల్లలకు బహుమతిగా ఇవ్వడమా.. ఇలా ఎన్నో ఆలోచనలు. తన సొంత పెన్షన్, భార్య ఫ్యామిలీ పెన్షన్.. ఇలా రెండూ కలిపి తడిసి మోపెడై.. పన్ను భారం చెల్లించే పెన్షనర్లు ఇంకొందరు. ఆదాయం అధికంగా ఉంటే పన్ను చెల్లించడమే ట్యాక్స్ ప్లానింగ్.

# టాటా కంపెనీకి డిమాండ్ నోటీసు.. రూ.7,800 కోట్లు బాకీ

సర్దుబాటు స్థూల ఆదాయం (ఏజీఆర్) బకాయిలు సుమారు రూ.7,800 కోట్లు చెల్లించాలని కోరుతూ టాటా కమ్యూనికేషన్స్‌కు టెలికాం విభాగం (DoT) షోకాజ్ కమ్ డిమాండ్ నోటీసు జారీ చేసింది. ఇవి 200506 నుంచి 202324 మధ్య కాలానికి సంబంధించిన ఏజీఆర్ బకాయిలుగా డిమాండ్ నోటీసులో పేర్కొంది. '200506 నుంచి 202324 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.7,827.55 కోట్ల షోకాజ్ కమ్ డిమాండ్ నోటీసులు భారత టెలికమ్యూనికేషన్స్ విభాగం నుంచి జూన్ 30, 2005 నాడు అందాయి' అని టాటా కమ్యూనికేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఏఎస్ లక్ష్మీనారాయణ్ తెలిపారు. ఇందులో ఐఎస్పీ (ఇంటర్నె



ట్ సర్వీస్ ప్రొవైడర్) లైసెన్స్ కింద 201011 ఆర్థిక సంవత్సరానికి, ఎన్ఎల్‌డీ (నేషనల్ లాంగ్ డిస్టెన్స్) లైసెన్స్ కింద 2007, 2010 ఆర్థిక సంవత్సాలకు కంపెనీ క్లెయిమ్ చేసిన మినహాయింపులు రూ .276.68 కోట్లను కూడా పేర్కొన్నట్లు ఆయన చెప్పారు. అయితే ఐఎల్‌డీ (ఇంటర్నేషనల్ లాంగ్ డిస్టెన్స్), ఎన్ఎల్‌డీ, ఐఎస్‌పీ లైసెన్సులకు సంబంధించి టాటా కమ్యూనికేషన్స్ గతంలో దాఖలు చేసిన అప్పీళ్లు సుప్రీంకోర్టు, టెలికాం ట్రిబ్యునల్ టీడీఎస్ఏటీ వద్ద పెండింగ్ లో ఉన్నాయి. పాత టెలికాం లైసెన్స్ విధానం యూఏఎస్ఎల్ కింద ఏజీఆర్‌పై 2019లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో కంపెనీ అప్పీళ్లను ప్రస్తావించలేదని లక్ష్మీనారాయణ్ తెలిపారు. కాబట్టి తమ లైసెన్సులు యూఏఎస్ఎల్‌కి భిన్నమని కంపెనీ భావిస్తోందని, స్వతంత్ర న్యాయ అభిప్రాయాల ఆధారంగా తన స్థానాన్ని సమర్థించుకోగలదని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

# రాజీనామాలు మాత్రం చేయొద్దు




దేశీయ అతిపెద్ద ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) 12,000 మంది ఉద్యోగులను తొలగించే యోచనలో ఉన్నట్లు ప్రకటించింది. ఈ తొలగింపు మధ్య, సీనియర్ స్థాయి ఉద్యోగులపై ప్రభావం చూపనుంది.ఈ ప్రకటన ఐటీ రంగంలో ప్రకంపనలు సృష్టించింది. టీసీఎస్ ఉద్యోగుల తొలగింపు ప్రకటనను ఐటీ ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

### ఒత్తిడికి తలొగ్గి రాజీనామాలు చేయొద్దు

ఈటీ నివేదిక ప్రకారం.. టీసీఎస్ తొలగింపులను చట్టవిరుద్ధమని ప్రకటించిన ఐటీ ఉద్యోగ సంఘాలు ఒత్తిడికి తలొగ్గి ఎవరూ రాజీనామా చేయొద్దంటూ టీసీఎస్ సిబ్బందికి సూచించాయి. అదే సమయంలో లేఆఫ్ ప్రణాళికలను ఉపసంహరించుకోవాలని, ప్రభావిత ఉద్యోగాలను పునరుద్ధరించాలని కర్ణాటక స్టేట్ ఐటీ/ఐటీఈఎస్ ఎంప్లాయీస్ యూనియన్ టీసీఎస్ యాజమాన్యాన్ని కోరింది.
రాజీనామా చేయాలని ఉద్యోగులపై ఒత్తిడి చేయొద్దని ఫోరం ఫర్ ఐటీ ఎంప్లాయీస్ (ఎఫ్ఐటీఈ) టీసీఎస్‌ను కోరింది. బాధితులకు నోటీస్ పీరియడ్ పేమెంట్స్, సెవెరెన్స్ బెనిఫిట్స్, ఏడాది పాటు ఇన్సూరెన్స్ కవరేజీని అందించాలని డిమాండ్ చేసింది. టీసీఎస్ ఆర్థికంగా పటిష్టంగా ఉందని, అనిశ్చితులేవీ లేనప్పటికీ ప్రకటించిన ఈ తొలగింపులు పూర్తిగా లాభాపేక్షతో తీసుకున్న నిర్ణయాలేనని ఎఫ్ఐటీఈ పేర్కొంది. అన్ని రికార్డులు సిద్ధం చేసుకోవాలని, స్వచ్ఛంద రాజీనామాలకు ఎవరూ వెళ్లొద్దని, నిష్క్రమించాలని ఒత్తిడి చేస్తే రాష్ట్ర లేబర్ కమిషనర్ లేదా ఎఫ్ఐటీఈ సహాయం తీసుకోవాలని ఉద్యోగులకు సూచించింది.


## అమ్మకాల ఒత్తిడి..
### బేర్‌మన్న మార్కెట్లు



బ్యాంకింగ్, ఐటీ, రియల్టీ కౌంటర్లలో అమ్మకాల ఒత్తిడితో బెంచ్ మార్క్ భారతీయ ఈక్విటీ సూచీలు నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 572.07 పాయింట్లు (0.70 శాతం) క్షీణించి 80,891 వద్ద స్థిరపడగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 156.10 పాయింట్లు లేదా 0.63 శాతం క్షీణించి 24,680.90 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ అనుబంధ షేర్లలో హిందుస్థాన్ యూనిలీవర్, ఏషియన్ పెయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్ గ్రిడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ మాత్రమే 1.23 శాతం వరకు లాభపడగా, మిగతావి నష్టాల్లో స్థిరపడ్డాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, టైటాన్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు 1.14 శాతం నుంచి 7.31 శాతం మధ్య నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ స్మాల్ క్యాప్ 100, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 సూచీలు వరుసగా 1.26 శాతం, 0.84 శాతం నష్టాలతో ముగిశాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, ఫార్మా మినహా ఎన్ఎస్ఈలోని ఇతర సెక్టోరల్ ఇండెక్స్‌లన్నీ రెడ్‌లో స్థిరపడగా, నిఫ్టీ రియల్టీ ఇండెక్స్ 4.26 శాతం నష్టంతో ముగిసింది.

# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

## జర్మనీలో రైలు ప్రమాదం.. ముగ్గురు మృతి



**బెర్లిన్:** జర్మనీలో ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. 100 మందితో వెళ్తున్న రైలు పట్టాలు తప్పడంతో ముగ్గురు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. జర్మనీలోని సిగ్మరింగెన్ పట్టణం నుండి ఉల్మ్ నగరానికి వెళుతున్న ప్యాసింజర్ రైలు అటవీ ప్రాంతంలో పట్టాలు తప్పింది. ఆదివారం(అక్కడి కాలమానం ప్రకారం) నైరుతి జర్మనీలోని బాడెన్‌వుర్టెంబర్గ్ పరిధిలోని రీడ్లింగెన్ పట్టణానికి సమీపంలో సాయంత్రం 6:10 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు ప్రయాణికులు మృతిచెందారని పోలీసులు తెలిపారు. 50 మంది గాయపడ్డారని భావిస్తున్నారు. అయితే వీరి సంఖ్య ఎంతనేది చెప్పేందుకు అధికారులు నిరాకరించారు. రెండు రైలు బోగీలు పట్టాలు తప్పాయని, దీనికిగల కారణం తెలియరాలేదని అధికారులు పేర్కొన్నారు. రైల్వే అధికారులు ప్రస్తుతం ప్రమాద తీరుతెన్నులను పరిశీలిస్తున్నారని ఆపరేటర్ తెలిపారు. ఈ మార్గంలో 40 కిలోమీటర్ల (25మైళ్ల) పొడవునా రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. మరోవైపు స్థానిక వాతావరణశాఖ ఈ ప్రాంతంలో తీవ్రమైన తుఫాను గాలులు వీస్తున్నందున కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్నదని హెచ్చరించింది. జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ మృతుల కుటుంబాలకు సంతాపాన్ని తెలిపారు. రవాణా మంత్రులతో మాట్లాడుతున్నానని, అత్యవసర సేవలను అందించాలని కోరానని ఆయన తెలిపారు. స్థానిక టీవీ స్టేషన్ ఎస్‌డబ్ల్యూ ఆర్ తెలిపిన వివరాల ప్రకారం గాయపడిన వారిని ఆ ప్రాంతంలోని వివిధ ఆస్పత్రులకు తరలించేందుకు హెలికాప్టర్లు సేవలు అందించాయి. కాగా 2022 జూన్‌లో దక్షిణ జర్మనీలోని బవేరియన్ ఆల్పైన్ రిసార్ట్ సమీపంలో ఒక రైలు పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. 1998లో లోయర్ సాక్సోనీలోని ఎస్చెడ్‌లో హైస్పీడ్ రైలు పట్టాలు తప్పగా, 101 మంది మృతిచెందారు.

## భూమ్మీద దేన్నైనా ఫోర్జరీ చేస్తారు కదా?: ఈసీకి సుప్రీం ప్రశ్న

బీహార్ ఓటరు జాబితా సవరణలో.. ఆధార్ కార్డుకు పౌరసత్వ గుర్తింపుకార్డుల జాబితా నుంచి మినహాయింపు ఇవ్వడాన్ని దేశ సర్వోన్నత న్యాయస్థానం మరోసారి తీవ్రంగా పరిగణించింది. ఆధార్‌తో పాటు ఓటర్ ఐడీ ఎలక్టోరల్ ఫోటో ఐడెంటిటీ కార్డు (EPIC)ని చెల్లుబాటు అయ్యే డాక్యుమెంట్ల కింద పరిగణించాల్సిందేనని కేంద్ర ఎన్నికల సంఘానికి స్పష్టం చేసింది.




బీహార్ ఓటర్ లిస్ట్ రివిజన్‌లో భాగంగా ఆధార్‌ను గుర్తింపుకార్డుగా ఈసీ పరిగణించడం లేదు. తద్వారా ఓట్ల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. అయితే ఈ వ్యవహారంపై సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. సోమవారం విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత ధర్మాసనం ఈసీని ఉద్దేశించి కీలక వ్యాఖ్య చేసింది. "భూమ్మీద దేనినైనా ఫోర్జరీ చేస్తారు కదా?" అని కేంద్ర ఎన్నికల సంఘం అభ్యంతరాలపై సూటిగా ప్రశ్నను సంధించింది. ఈ క్రమంలో.. ఆధార్‌ను తిరస్కరిస్తూ.. బీహార్ ఓటర్ల రివిజన్ ప్రక్రియలో ఓట్లను తొలగిస్తూ వస్తోంది ఎన్నికల సంఘం. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. జులై 10వ తేదీ నాటి విచారణ సందర్భంగా బీహార్ ఓటర్ లిస్ట్ రివిజన్ సబబేనన్న సుప్రీం ధర్మాసనం.. అదే సమయంలో ఆధార్, ఎపిక్, రేషన్ కార్డులనూ పరిగణనలోకి తీసుకోవాల్సిందేనని ఈసీకి స్పష్టం చేసింది. అయితే.. ఇవాళ్టి వాదనల సందర్భంగా ఆధార్‌ను ప్రూఫ్ ఆఫ్ సిటిజన్‌షిప్‌గా పరిగణించడం కుదరదని, రేషన్ కార్డులు నకిలీవి సృష్టించే అవకాశం లేకపోలేదని.. కాబట్టి వాటి మీద ఆధారపడలేమని ఈసీ వాదనలు వినిపించింది. అలాగే ఓటర్ నమోదు ప్రక్రియలో ఆధార్‌ను కేవలం ఐడెంటిటీ ప్రూఫ్‌గా మాత్రమే పరిగణిస్తామని పేర్కొంది. దీనిపై సుప్రీం కోర్టు స్పందించింది. ఈ భూమ్మీద ఏ డాక్యుమెంట్‌ను ఫోర్జరీ చేయలేరో చెప్పాలంటూ ఈసీని ప్రశ్నించింది. ఓటర్ నమోదు సమయంలో ఆధార్ ప్రస్తావన ఉంటున్నప్పటికీ.. ఓటరు జాబితా గుర్తింపు కోసం ఎందుకు పరిగణించడం లేదని మరోసారి నిలదీసింది. ఈ క్రమంలో.. ఆధార్, ఎపిక్‌ని బీహార్ ఓటర్ రోల్ రివిజన్‌కు చేర్చాలంటూ ఆదేశించింది. ఎన్నికల సంఘం (EC) జాబితాలోని ఏదీ నిర్ణయాత్మక పత్రం కాదు కదా. ఆధార్, ఎపిక్ విషయాల్లో మీరు ఎత్తిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటే గనుక రేపు మీరు అంగీకరించిన ఇతర పత్రాలు కూడా ఫోర్జరీ జరిగితే.. దాన్ని నిరోధించే వ్యవస్థ ఎక్కడ? అని ఈసీకి ప్రశ్న ఎదురైంది. అదే సమయంలో.. ఆగస్టు 1వ తేదీన ఈసీ ప్రచురించబోయే బీహార్ ఓటర్ల డ్రాఫ్ట్ లిస్ట్‌పై మధ్యంతర స్టే విధించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణన్ కోరారు. అయితే.. రేపటి విచారణలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని బెంచ్ స్పష్టం చేసింది.

## ఈయూతో ట్రంప్ భారీ వాణిజ్య ఒప్పందం
### దిగుమతులపై 15 శాతం సుంకాలు

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యూరోపియన్ యూనియన్‌తో భారీ వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించారు. ఇకపై ఈయూ దిగుమతులపై అమెరికా 15 శాతం సుంకాలను విధించనున్నదని వెల్లడించారు. యునైటెడ్ స్టేట్స్ దీనిని మునుపెన్నడూ లేని భారీ వాణిజ్య ఒప్పందంగా అభివర్ణించింది. యూరోపియన్ వస్తువులపై 30శాతం అమెరికా సుంకాలను నివారించేందుకు ఆగస్టు ఒకటితో గడువు సమీపిస్తున్న తరుణంలో ఈ ఒప్పందం కుదిరింది. స్కాట్లాండ్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్‌ల మధ్య జరిగిన సమావేశంలో ఈ ఒప్పందం కుదిరింది. ఈయూతో తాము ఒక ఒప్పందం కుదుర్చుకున్నామని, ఇది ఇరు దేశాలకు లబ్ధి చేకూర్చే ఒప్పందం అని, బహుశా ఇది ఆ దేశంతో కుదిరిన పెద్ద ఒప్పందం అని ట్రంప్ వార్తాసంస్థ ఎఎఫ్‌పీకి తెలిపారు.



ఈ 15శాతం సుంకాలు యూరప్‌లోని కీలకమైన ఆటోమొబైల్ రంగం, ఫార్మాస్యూటికల్స్, సెమీ కండక్టర్లతో సహా అన్ని రంగాలకు వర్తిస్తాయని ట్రంప్ తెలిపారు. ఈ ఒప్పందం కారణంగా 27 దేశాల ఈయూ కూటమి యునైటెడ్ స్టేట్స్ నుండి 750 బిలియన్ డాలర్ల విలువైన ఇంధనశక్తిని కొనుగోలు చేస్తుందని, ఈయూ 600 బిలియన్ డాలర్ల అదనపు పెట్టుబడులను అందిస్తుందని ట్రంప్ పేర్కొన్నారు. రష్యా నుండి ఇంధనంపై ఆధారపడటాన్ని తగ్గించే ప్రయత్నంలో భాగంగా, రాబోయే మూడు సంవత్సరాలలో యూరోపియన్ యూనియన్ అమెరికా నుంచి ద్రవీకృత సహజ వాయువు, చమురు అణు ఇంధనాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తుందని వాన్ డెర్ లేయన్ తెలిపారు. విమానాలు, కొన్ని రసాయనాలు, పలు వ్యవసాయ వస్తువులు, కీలక ముడి పదార్థాలు తరహా ఉత్పత్తులపై సుంకాలను తొలగించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయని ఆమె పేర్కొన్నారు. జనవరిలో ట్రంప్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి ఈయూ పలు సుంకాల కారణంగా ఇబ్బందులను ఎదుర్కొంది. కార్లపై 25శాతం పన్ను, ఉక్కు, అల్యూమినియంపై 50శాతం సుంకాన్ని ఎదుర్కొంటోంది. అయితే ఇప్పుడు ఒప్పందం కుదరకపోతే ఈ 10శాతం సుంకాల రేటు 30శాతం వరకు పెరుగుతుందని అమెరికా హెచ్చరించింది.

## బ్యాంకాక్‌లో దుండగుడి కాల్పులు..
### ఆరుగురు మృతి



**బ్యాంకాక్:** థాయ్‌ల్యాండ్ రాజధాని బ్యాంకాక్‌లో కాల్పుల ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. ఓ దుండగుడు మార్కెట్‌లో విచక్షణరహితంగా కాల్పులు జరపడంతో ఆరుగురు మృతి చెందారు. మృతుల్లో ఒక మహిళ ఉన్నట్టు సమాచారం. వివరాల ప్రకారం.. బ్యాంకాక్‌లో వ్యవసాయ ఉత్పత్తులు, స్థానిక ఆహారాన్ని విక్రయించే ఓర్ టు కో మార్కెట్‌లో సోమవారం ఓ గుర్తు తెలియని దుండగుడు తుపాకీతో కాల్పులు జరిపాడు. అనంతరం, అతను కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. మృతుల్లో నలుగురు సెక్యూరిటీ గార్డులు, ఒక మహిళ ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

## ఆకలి చావులను అరికట్టండి
### గాజా పరిస్థితులపై ఒబామా ఆవేదన

**గాజా:** గాజా స్ట్రిప్‌లో అంతకంతకూ పెరుగుతున్న మానవతా సంక్షోభం మధ్య అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా కీలక వ్యాఖ్యలు చేశారు. గాజాలో ఆకలి చావులను అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. గాజాలో సంక్షోభానికి శాశ్వత పరిష్కారం.. ఇజ్రాయెల్ బందీలను వెనక్కి తీసుకురావడం, ఇజ్రాయెల్ సైనిక కార్యకలాపాలను నిలిపివేయడం జరగాలని ఒబామా పేర్కొన్నారు. ఆకలితో అక్కడి అమాయక ప్రజలు చనిపోతున్నారని, దీనిని నివారించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఒబామా పేర్కొన్నారు. గాజా స్ట్రిప్‌లోని బాధితులను కలుసుకునేందుకు, వారికి సహాయం చేసేందుకు అనుమతులు ఉండాలన్నారు. వారికి ఆహారం, నీటిని దూరంగా ఉంచడం సమర్థనీయం కాదన్నారు. మరోవైపు గాజాలో పోషకాహార లోపం ఆందోళనకర స్థాయికి చేరుకున్నదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (హూ) ఆదివారం హెచ్చరించింది. వారికి అందే సహాయాన్ని ఉద్దేశపూర్వకంగా నిరోధించడం కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఏడాది నమోదైన 74 పోషకాహార లోపం మరణాలలో 63 జూలైలో సంభవించాయి. ఇందులో 24 మంది



ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిన వివరాల ప్రకారం, గాజాలో దాదాపు ఐదుగురు పిల్లలలో ఒకరు తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఆహార నిపుణులు కూడా గాజాలో కరువు పరిస్థితులపై ఎప్పటి నుంచో హెచ్చరిస్తున్నారు. ఇక్కడి జనాభాకు సహాయం అందించడంపై ఇజ్రాయెల్ పరిమితులు విధించింది. కాగా ఇజ్రాయెల్ సైన్యం ఆదివారం గాజాలోని మూడు ప్రాంతాలలో రోజుకు 10 గంటల పాటు యుద్ధానికి విరామం ప్రకటించింది. తదుపరి ప్రకటన వచ్చే వరకు ఈ విరామం ప్రతి రోజూ ఉదయం 10:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు ఉంటుందని ఇజ్రాయెల్ తెలిపింది.



మహా పత్రిక

WWW.MAHAADAILY.COM | సినిమా వార్త … WS | మంగళవారం, హైదరాబాద్ | 29-07-2025



# హీరోయిన్‌తో సూపర్ హీరో సినిమా.

ఇప్పటివరకు పలు భాషల్లో సూపర్ హీరో తరహా సినిమాలు వచ్చాయి. కానీ ఇప్పుడు ఓ యంగ్ హీరోయిన్‌ని లీడ్ రోల్‌లో పెట్టి ఇలాంటి మూవీని మలయాళంలో తీశారు. అదే 'లోకా'. తెలుగు ప్రేక్షకులకు పరిచయమున్న దుల్కర్ సల్మాన్ ఈ చిత్రాన్ని నిర్మించగా.. కల్యాణి ప్రియదర్శిని ప్రధాన పాత్ర పోషించింది. తాజాగా టీజర్ రిలీజ్ చేయగా.. అది ఆకట్టుకునేలా ఉంది. 'హలో', 'చిత్రలహరి' లాంటి తెలుగు సినిమాల్లో హీరోయిన్‌గా చేసిన కల్యాణి ప్రియదర్శన్.. తర్వాత పూర్తిగా మలయాళ చిత్రసీమకే పరిమితమైపోయింది. మిడ్ రేంజ్ మూవీస్‌లో నటిస్తూ కెరీర్ పరంగా బాగానే ఉంది. అయితే ఈమెని పెట్టి సూపర్ హీరో జానర్ మూవీ తీయడం విశేషం. 'లోకా'ని తెలుగులోనూ త్వరలో రిలీజ్ చేయనున్నారు. ఇందులో కల్యాణికి జోడిగా 'ప్రేమలు' ఫేమ్ నస్లేన్ నటిస్తున్నాడు.







## విజయ్ దేవరకొండతో ఫ్యాన్స్ మీట్..

# బిర్యానీతో పాటు సెల్ఫీలు

రౌడీబాయ్ విజయ్ దేవరకొండ తన అభిమానులతో కొంత సమయం పాటు సరదాగ గడిపారు. తను నటించిన కొత్త సినిమా కింగ్డమ్ విడుదల సందర్భంగా వారందరినీ కలుసుకున్నారు. అందుకు వేదికగా హైదరాబాద్‌లోని సారథి స్టూడియో నిలిచింది. తమ అభిమాన హీరోను కలిసి దిగిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. విజయ్ దేవరకొండ ఏర్పాటు చేసిన ఫ్యాన్స్ మీట్‌లో ఎక్కువమంది కాలేజీ విద్యార్థులే పాల్గొన్నారు. వాస్తవంగా ఆయన్ను యూత్ ఎక్కువగా ఇష్టపడుతారని తెలిసిందే. ఈ క్రమంలో విజయ్ కూడా వారిని ఎంతమాత్రం నిరుత్సాహపరచలేదు. అక్కడికి వచ్చిన తన ఫ్యాన్స్ అందరితో ఫోటోలు దిగారు. వారందరూ కూర్చునేందుకు అన్ని ఏర్పాట్లు చేయడమే కాకుండా.. చికెన్‌తో పాటు బగారా అన్నం రెడీ చేపించారు. తమ పట్ల విజయ్ చూపిన ప్రేమకు అభిమానులు ఫిదా అయ్యారు. నేడు (జులై 28) కింగ్డమ్ ప్రీరిలీజ్ వేడుక హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్‌లో జరగనుంది. సాయింత్రం 5గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున విజయ్ ఫ్యాన్స్ పాల్గొననున్నారు.

'కింగ్‌డమ్' చిత్రం జులై 31న పాన్ ఇండియా రేంజ్‌లో విడుదల కానుంది. 'జెర్సీ' మూవీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. పీరియాడికల్ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ చిత్రంలో ఇప్పటివరకూ కనిపించని వైవిధ్యమైన పాత్రలో, స్పై పోలీస్ ఆఫీసర్‌గా సందడి చేయనున్నారట విజయ్. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్స్, టీజర్, పాటలకి అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. విజయ్ నటించిన ఏ సినిమా ఇప్పటి వరకూ రెండు భాగాలుగా రాలేదు. అలా వస్తున్న ఆయన మొదటి చిత్రం 'కింగ్‌డమ్' కానుండటం విశేషం. ఈ సినిమా రెండో భాగానికి 'కింగ్‌డమ్ స్క్వేర్' లేదా 'కింగ్‌డమ్ 2' అనే టైటిల్స్ పరిశీలనలో ఉన్నాయి.

## పెళ్లి చేసుకుని పిల్లల్ని కనాలన్నదే నా కల..

హిందీ, తెలుగు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది మృణాల్ ఠాకూర్. 32 ఏళ్ల ఈ మహారాష్ట్ర బ్యూటీ సీతారామం చిత్రంతో టాలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చింది. ఇక్కడ తొలి చిత్రంతోనే సూపర్ హిట్ అందుకున్న ఠాగూర్‌కు అక్కడ వరుస అవకాశాలు వచ్చాయి. అదేవిధంగా సీతారామం చిత్రం తమిళంలోనూ అనువాదమై అక్కడా మంచి గుర్తింపు లభించింది. దీంతో కోలీవుడ్‌లోనూ అవకాశాలు తలుపుతట్టాయి. అలా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో మదరాశి చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. అయితే ఏమైందో ఏమోకానీ, ఆ అవకాశాన్ని మృణాల్ ఠాకూర్ చేజార్చుకుంది. అప్పటినుంచి ఇప్పటివరకు తమిళ చిత్రపరిశ్రమ ఆమె వైపు చూడడం లేదు. ప్రస్తుతం హిందీలో మూడు చిత్రాలు చేస్తూ బిజీగా ఉన్న ఈ అమ్మడు తెలుగులో డకాయిట్ మూవీలో యాక్ట్ చేస్తోంది. అదేవిధంగా అల్లు అర్జున్ సరసన నటించే మరో లక్కీఛాన్స్ ఈ బ్యూటీని వరించినట్లు సమాచారం. ఇదిలా ఉంటే ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఈ బ్యూటీ పెళ్లి గురించి తన మనసులోని మాటను బయటపెట్టింది. పెళ్లి చేసుకోవాలి, పిల్లల్ని కనాలన్నది తన చిన్న వయసు నుంచే కల అని పేర్కొంది. అయితే ప్రస్తుతం తన దృష్టి అంతా చిత్ర పరిశ్రమపైనే ఉందని, సినిమాల్లో బాగా సక్సెస్ అవ్వాలని తెలిపింది.



# రోజురోజుకీ పెరుగుతున్న వసూళ్లు..

కొన్నిసార్లు చిన్న సినిమాలు అద్భుతాలు చేస్తుంటాయి. అలా గత శుక్రవారం థియేటర్లలోకి వచ్చిన 'మహావతార్ నరసింహ' అనే యానిమేటెడ్ మూవీ బాక్సాఫీస్ దగ్గర వండర్స్ క్రియేట్ చేస్తున్నట్లు కనిపిస్తుంది. ఎందుకంటే సాధారణంగా యానిమేటెడ్ చిత్రాలు మన దగ్గర పెద్దగా ఆడిన దాఖలాలు లేవు. కానీ ఈ మూవీ మాత్రం మౌత్ టాక్‌తో పాటు కళ్లు చెదిరే కలెక్షన్స్ సొంతం చేసుకుంటోంది. తాజాగా ఆదివారం ఒక్కరోజే ఏకంగా రూ.10 కోట్లకు పైన వసూళ్లు రావడం విశేషం. ఓవైపు 'హరిహర వీరమల్లు' లాంటి తెలుగు సినిమా పోటీ ఉన్నప్పటికీ.. 'మహావతార్ నరసింహ' స్క్రీన్ కౌంట్ పెంచుకుంటూ పోతోంది. తొలిరోజు కొన్ని థియేటర్లు దక్కగా.. రెండోరోజు, మూడో రోజుకి థియేటర్ల సంఖ్య పెరిగింది. అదే రీతిన వసూళ్లు కూడా పెరుగుతూ వస్తున్నాయి. తొలిరెండు రోజుల్లో కలిపి రూ.5 కోట్ల మేర కలెక్షన్స్ రాగా.. మూడో రోజైన ఆదివారం మాత్రం దేశవ్యాప్తంగా రూ.11.25 కోట్లు వచ్చినట్లు స్వయంగా నిర్మాణ సంస్థ పోస్టర్ రిలీజ్ చేసింది. ఈ లెక్కన చూసుకుంటే మూడు రోజుల్లో కలిపి దాదాపు రూ.20 కోట్ల వసూళ్లకు చేరువలో ఉందని తెలుస్తోంది. కేజీఎఫ్, కాంతార, సలార్ సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న హోంబలే ఫిల్మ్స్ నిర్మించిన యానిమేటెడ్ సినిమా 'మహావతార్ నరసింహ'. మనకు బాగా తెలిసిన విష్ణు అవతారాలు ఆధారంగా ఓ యూనివర్స్ ప్లాన్ చేశారు. అందులో భాగంగా రిలీజైన తొలి పార్ట్ ఇది. నరసింహ స్వామి అవతారం స్టోరీతో తెరకెక్కిన ఈ చిత్రం చిన్నపిల్లలకే కాదు పెద్దవాళ్లకు కూడా అమితంగా నచ్చేస్తోంది. సాధారణంగా మన దగ్గర యానిమేటెడ్ మూవీస్ పెద్దగా వర్కౌట్ కావు. గతంలో 'హనుమాన్' తదితర చిత్రాలు వచ్చాయి. పాజిటివ్ టాక్ తెచ్చుకున్నా సరే వసూళ్లు రాబట్టుకోలేకపోయాయి. ఈ సినిమా మాత్రం కోట్ల రూపాయలు కలెక్షన్స్, అది కూడా పాన్ ఇండియా లెవల్లో అంటే విశేషమనే చెప్పాలి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com